విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

ఆదివారం 09 నవంబరు 2025 8 పేజీలు

ప్రణాళిక బద్ధంగా పథకాలు అమలు

- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి

- 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రణాళిక బద్ధంగా పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో లంక దినకర్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి వైద్య ఆరోగ్యం, అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జననీ సురక్షా యోజన, జననీ శిశు సంరక్ష కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన తదితర పథకాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షించి, పురోగతికి అవసరమైన కార్యాచరణపై సూచనలు చేశారు. బహుళ ప్రయోజనాల పీఎం సూర్యఘర్ పథకం అమల్లోనూ -మిగతా 2 లో ...

కోర్టు సముదాయంలో
చెస్ పోటీలు

ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్

విశాలాంధ్ర-విజయవాడ: ది ఏపీ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి న్యాయవాదలు క్యారమ్స్, చెస్ పోటీలు కోర్టు సముదాయంలో రెండు రోజులు పాటు జరగనున్నాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్, కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఏ సత్యానంద శనివారం రిబ్బన్ కట్ చేసిన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మానవేంద్ర నాథ్ రాయ్ మాట్లాడుతూ కోర్టు సముదాయంలో జడ్జిగా పనిచేసినప్పుడే నూతన కోర్టు సముదాయానికి పునాది పడిందన్నారు. బెజవాడ్ బార్‌కు దేశంలో ప్రత్యేక స్థానం ఉందని ఎంతోమంది న్యాయవాదలు ఇక్కడ నుండే వచ్చారని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి హెూదాలో ఈ బార్‌కు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏపీ రాష్ట్ర బార్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ కే సీతారాం మాట్లాడుతూ బార్ ఫెడరేషన్ తరపున ఈ పోటీలు నిర్వహించడం న్యాయవాదుల ఐక్యతను చూపించారని కొనియాడారు. ది ఏపీ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ కె బాష మాట్లాడుతూ ఈ పోటీలు ద్వారా -మిగతా 2 లో ...

పెద్ద చెరువులు గుర్తించాలి

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులలో భాగంగా జిల్లాలో పెద్ద చెరువులను గుర్తించాలని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ, గృహ నిర్మాణం, గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువులను గుర్తించి వాటిని అందంగా ఆహ్లాదకరంగా రూపొందించాలని అన్నారు. పెద్ద చెరువులు నీటి పరిరక్షణకు ఎంతగానో తోడ్పడతాయని మంత్రి చెప్పారు. వాటి వద్ద వాకింగ్ ట్రాక్‌లు వంటివి ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎక్కువ ఉపయోగం ఉంటుందని అన్నారు. ఉపాధి హామీ పనుల సుస్థిర ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వేతనదారులు అందరికి ఈ-కేవైసీ పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఉపాధి హామీ గొప్ప వరమని పేర్కొన్నారు. మెటీరియల్ కాంపోనెంటు ఎక్కువగా జనరేట్ చేయడానికి ప్రయత్నించాలని తద్వారా జిల్లాలో మౌలిక సదుపాయాలను కల్పించుటకు అవసరమగు నిధులు -మిగతా 2 లో ...

పంటకాలువలో గల్లంతైన యువకుడు మృతి

వివరాలు 3 లో ...

నిర్మాణ కార్మికులకు వెన్నుపోటు

వివరాలు 3 లో ...

టెక్నాలజీతో నైతికత అవసరం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : న్యాయ, పరిపాలనా వ్యవస్థలు ప్రజల అంచనాలకు తగిన విధంగా పనిచేయాలంటే టెక్నాలజీతో పాటు నైతికత, మానవత్వం కూడా అంతే అవసరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా ఆధ్వర్యంలో న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రో బోనో లీగల్ సర్వీసెస్ సహకారంతో 'కృత్రిమ మేధస్సు-సాంకేతిక యుగంలో న్యాయ సహాయం-న్యాయం అందుబాటులోకి తేవడం' అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు శనివారం జరిగింది. తొలుత యూనివర్సిటీలోని ఎన్టీఆర్ లైబ్రరీలో తన పేరుతో -మిగతా 2 లో ...

కోలాహలంగా వీవీఐటీయూ బాలోత్సవ్-2025

విశాలాంధ్ర-పెదకాకాని : ప్రపంచ తెలుగు బాలల పండుగ 'వీవీఐటీయూ బాలోత్సవ్ 2025' వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో చిన్నారుల కేరింతలతో రెండవ రోజు కోలాహలంగా సాగాయి. సెలవు దినాలు కావటంతో పెద్ద మొత్తంలో సందర్శకులు హాజరుకావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 280 పాఠశాలల నుంచి 4000 మంది విద్యార్థులు రెండవ రోజు నిర్వహించిన సబ్ జూనియర్స్ విభాగాల పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో భాగంగా జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద ప్రేక్షకుల కరతాల ధ్వనులతో సందడిగా సాగాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 54 నాటికలు చిన్నారులకు సమాజంపట్ల ఉన్న దృక్పథాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. సమాజానికి హితవుపలికే విధంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు

వారిలోని సృజనాత్మకతను వెలికితీసాయి. పోటీలలో పాల్గొన్న -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళిక బద్ధంగా పథకాలు అమలు

మరింత చొరవ చూపాలన్నారు. అనంతరం లంక దినకర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో100 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని.. జననీ సురక్షా యోజన ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 1,685 మందికి, పట్టణ ప్రాంతాల్లో 924 మందికి లబ్ధి చేకూరిందన్నారు. అదేవిధంగా జననీ శిశు సంరక్ష కార్యక్రమం ద్వారా ఉచిత పౌష్టికాహారం, మందులు, వైద్య పరీక్షలు వంటి సేవలు అందుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టిసారిస్తోందని.. ఈ క్రమంలో మాతా శిశు మరణాల రేటును తగ్గించడంపై అధికారులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ కార్యక్రమం కింద జిల్లాలో జగ్గయ్యపేట, ఏ.కొండూరు, తిరువూరులో డయాలసిస్ సేవలు అందుతున్నాయని.. మొత్తంమీద 20 కేంద్రాల ద్వారా ఈ సేవలు అందుతున్నాయన్నారు. ఏ.కొండూరు ప్రాంతంలో డయాలసిస్ సేవల విస్తృతికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.సమన్వయ శాఖల సమిష్టి కృషితో అన్ని పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఏ.విద్యాసాగర్, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, డా. ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయ అధికారి డా. జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులు గుర్తించాలి

అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఉపాధి హామీ కింద కొబ్బరి, కాయగూరలు వంటి పంటలను ప్రోత్సహించడం జరుగుతుందని, అయితే వాటిలో ఏది రైతులకు ఎక్కువ లాభదాయకత ఉందో విశ్లేషించాలని ఆదేశించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ క్లస్టర్లను ఏర్పాటు చేయించడానికి చర్యలు తీసుకుంటున్నామని, అవసరమగు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా పచ్చళ్ళ తయారీకి ప్రసిద్ధి చెందిందని, అందుకుగాను కొన్ని ఉత్తమ స్వయం సహాయక సంఘాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పచ్చళ్ళు తయారు చేయడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచే స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ, పంట పొలాల్లో గుంటలు, వివిధ పథకాల క్రింద క్లస్టర్ల ఏర్పాటు తదితర అంశాలను గురించి ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని చెప్పారు. అవగాహన కల్పించుటకు డిజిటల్ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గృహ నిర్మాణానికి ప్రతి లేఅవుట్లో చేపట్టాల్సిన అవసరాలు గుర్తించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లాలో చేపడుతున్న పనుల వివరాలను తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ మాట్లాడుతూ జిల్లాలో 15 మండలాల్లో 234 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 31 లక్షల పని దినాలను కల్పించడం జరిగిందని చెప్పారు. అమృత్ సరోవర్ మొదటి దశలో 74 చెరువులను ప్రారంభించి పూర్తి చేశామని, రెండవ దశలో 25 చెరువులను మంజూరు చేశామని రెండు ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 1.40 లక్షల జాబు కార్డుదారులకు ఈ-కేవైసీ పూర్తి చేశామని తెలిపారు. 1498 పంట గుంటలను మంజూరు చేయగా ఇప్పటివరకు 242 పూర్తి చేశామని ఆయన చెప్పారు. రైతులు పంట కుంటలు ఏర్పాటుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రతిపాదు నియోజకవర్గంలో ఉప్పు నీరు వస్తుందని అటువంటి ప్రాంతాల్లో పంట కుంటలు ఏర్పాటు చేయడం వలన మంచినీరు వచ్చుటకు అవకాశాలు ఎక్కువగా ఉంటుందని దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. జిల్లాలో ఏడు శాతం మాత్రమే పచ్చదనం ఉందని ఇందుకుగాను పెద్ద ఎత్తున మొక్కలు నాటుటకు చర్యలు చేపట్టామని తెలిపారు. కాలువ గట్ల మీద ఎక్కువగా మొక్కలు నాటడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఉద్యానవన పంటల కింద 278 ఎకరాల్లో మొక్కలు నాటామని, 24 ఎకరాల్లో పశు దానా వేయడం జరిగిందని, 38 ఎకరాల మేర దారి పొడవునా మొక్కలు నాటడం జరిగిందని చెప్పారు. డీఆర్డీఏ పీడీ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, కొన్ని సంఘాలు ఏడాదికి కోటి రూపాయల పైగా టర్నోవర్ కలిగి ఉన్నాయని వివరించారు. క్లస్టర్ల క్రింద వివిధ ప్రాజెక్టులకు డీపీఆర్‌లను సమర్పించామని తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ అధికారి జిల్లాలో గృహ నిర్మాణాల వివరాలను తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సీపీ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సముదాయంలో చెస్ పోటీలు

న్యాయవాదులంతా ఒకచోట కలవడం శుభపరిణామన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి హైకోర్టు న్యాయమూర్తి రావడంతో పోటీదారులకు ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఈ పోటీలను ప్రారంభించిన న్యాయమూర్తులను ఘనంగా సన్మానించి ప్రముఖ న్యాయవాది హజరత్తయ్య గుప్తా వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, ఏపీ హైకోర్టు ప్రెసిడెంట్ చిదంబరం, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని చెస్, క్యారమ్స్ ఆడారు. ఈ పోటీలు నిర్వహించడానికి కృషి చేసిన బెజవాడ బార్ సభ్యులు భార్గవ్ , యు జాన్ విక్టరీ, పుష్పాల శ్రీనివాస్ , శ్రీహరి, గరికపాటి రామ్ తేజ, కీర్తి చైతన్య, అనీఫ్ , ఉదయ్ , కే సురేష్ కుమార్, వై రామకృష్ణ, జాన్ బాబు, సి శివ శంకర్ , సువర్ణ రాజు, శిరీషకు ధన్యవాదాలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ నుంచి 148 పోటీ దారులు పాల్గొనగా వివిధ బార్ అసోసియేషన్ ల నుంచి సుమారు 200 మందికి పైగా పాల్గొన్నారు.

కోలాహలంగా వీవీఐటీయూ బాలోత్సవ్-2025

విద్యార్థులకు అనుభవాల మార్పిడి కొత్తధనం నేర్పించటానికి ఉపయోగపడేలా న్యాయనిర్ణేతలు ప్రత్యేక బోధనలు చేసారు. వాద్య సంగీతంలోని రాగప్రధానం, తాళ ప్రధానం, ఆహుతులను ఆకట్టుకున్నాయి. పోటీల అనంతరం నిర్వహించిన గజల్ శ్రీనివాస్ సంగీత కచేరి చిన్నారులను అలరించింది.

టెక్నాలజీతో నైతికత అవసరం

ఏర్పాటు చేసిన ప్రత్యేక సెక్షన్‌ను జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ న్యాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులు లేదా న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు పరిశోధన, డ్రాఫ్టింగ్, పరిపాలనలో సహకరించినా, న్యాయ సారం మాత్రం మానవ ఆలోచన, విశ్లేషణ, దయ, నైతిక తీర్పులోనే ఉంటుందని వివరించారు. 'న్యాయం అంటే కేవలం చట్టపరమైన అర్థమే కాదు.... అది మానవ మనసు, దయ, సమానత్వం, బాధ్యతల సమ్మేళనమని వ్యాఖ్యానించారు. పేదవర్గాలకు న్యాయసహాయం చేరేలా అవగాహన కార్యక్రమాలు, సులభ న్యాయసేవలు, డిజిటల్ సదుపాయాలు విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ మానవ తీర్పుకు సహాయకంగా ఉండాలి గానీ, దాని స్థానంలోకి రాకూడదని స్పష్టం చేశారు. 2050 నాటికి బయోటెక్నాలజీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో ఊహించలేని అభివృద్ధి జరుగుతుందని, టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా మానవ మనసు, న్యాయం, దయ ఇవే సమాజాన్ని నిలబెడతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ రావు మాట్లాడుతూ టెక్నాలజీ శక్తివంతమైన సాధనం, కానీ దాని విలువ మానవ సేవలోనే ఉందని అన్నారు. భారత న్యాయవ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ-కోర్ట్స్, పేపర్ ఫ్రీ కోర్ట్స్ వంటి పథకాలు న్యాయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. సీబీఐ ఏఐ ఆధారంగా సాక్ష్యాల పరిశీలన జరపడం దర్యాప్తు నాణ్యతను పెంచుతోందని చెప్పారు. లాన్ నెట్‌వర్కింగ్, ఆన్‌లైన్ కేసు ట్రాకింగ్ సిస్టమ్, ప్రజలకు అందుబాటులో ఉన్న వెబ్ పోర్టల్స్ పారదర్శకతను పెంచుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అందరికీ అవగాన అవసరం

- డాక్టర్ ఆదిత్య వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ: ఆధునిక కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వ్యాధుల్లో కేన్సరు ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాదిమందిని ప్రభావితం చేసే ఈ వ్యాధి గురించి ప్రజలు సరైన అవగాహన కలిగి ఉండటం అవసరమని ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ ఎన్ ఆదిత్య పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్లో డాక్టరు సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన క్యాన్సర్ అంశంపై ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఊపిరితిత్తులు, వక్షోజాలు, కొలోరెక్టల్ కేన్సర్లు అత్యధికం అన్నారు. భారతదేశంలో 2022లో 14లక్షల 60వేల కొత్త కేన్సర్లు సంక్రమించగా ఈ సంవత్సరాంతానికి అవి 15లక్షల 70వేలకు చేరుతున్నాయన్నారు. వంశపారంపర్యంగా కేన్సరు వచ్చే అవకాశం 5-10శాతం మాత్రమే అన్నారు. కేన్సరు రావడానికి ప్రధానంగా ధూమపానం, మద్యపానం, పొగాకుకి సంబంధించిన గుట్కాలు, ఖైనీలు ప్రధాన కారణాలు అన్నారు. మద్యపానం వల్ల నోరు, స్వరపేటిక, అన్నవాహిక, జీర్ణకోశం, లివరు, పెద్దపేగులకి కేన్సరు వస్తుందన్నారు. ధూమపానం వల్ల కూడా ఎన్నో రకాల కేన్సర్లు తలెత్తుతాయన్నారు. స్థూలకాయం వల్ల 10రకాల కేన్సర్లు తయారవుతాయన్నారు. శారీరక వ్యాయామం చేసేవాళ్ళల్లో కేన్సరు రావడం తక్కువ అని పేర్కొన్నారు.

ఆటో కార్మికులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లిలోని గ్రేస్ వైద్యశాల సౌజన్యంతో ఆటో డ్రైవర్లకు శనివారం దుస్తుల పంపిణీ జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రేపల్లె ఆటో పాయింట్ ఆటో కార్మికులు 50 మందికి గ్రేస్ వైద్యశాల యాజమాన్యం అందించిన దుస్తులను ఆసుపత్రి ప్రతినిధులు పసుపులేటి కృష్ణ, పసుపులేటి శ్రీనివాసరావు, పసుపులేటి మహేష్లు ఆటోయూనియన్ నేతలు వెనిగళ్ల వసంతరావు, మహమ్మద్ కరీముల్లా, రావుల దావీద్లతో కలిసి కార్మికులకు పంపిణీ చేశారు. ఆటో కార్మికులకు దుస్తులు అందించిన గ్రేస్ హాస్పటల్ యాజమాన్యానికి సీఐటీయూ తరపున అభినందనలు తెలిపారు.

గుంపులు గుంపులుగా వీధి కుక్కలు... భయాందోళనలో మండల ప్రజలు

విశాలాంధ్ర -వీరులపాడు: గ్రామాలలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉండటంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్రభయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో అనేక ప్రాంతాలలో కుక్కకాటుకు గురై మరణించే వారి సంఖ్య అధికం అవుతుండటంతో మరింత భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం జుజ్జూరు గ్రామంలో ఏ వీధిలో చూసినా వీధి కుక్కల సంచారం ఎక్కువైంది. దీంతో ప్రజలు ఒంటరిగా వీధులలో తిరిగేందుకు కూడా భయపడుతున్నారు. ఎక్కడ వీధి కుక్కలు తమపై దాడి చేసి గాయపరుస్తాయేమోనని భయంతో బిక్కుబిక్కుమంటూ గడపవలసి వస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కల సంచార నియంత్రణకు సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు పరచాలని,వీధి కుక్కలను నియంత్రించి కుక్కల దాడుల నుండి తమను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మహేష్ తల్లికి రావెళ్ల నివాళులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఎస్ సి విభాగం నాయకుడు ఉయ్యూరు మహేష్ మాతృమూర్తి పుష్పరాజ్యం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంఈఎఫ్ (మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్) ఉభయ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షుడు రావెళ్ల వరుణకుమార్, సీపీఐ పామర్రు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సందోలు నాగేశ్వరరావు, అరుంధతి బంధు సంక్షేమ సేవ మండలి రాష్ట్ర అధ్యక్షుడు పెదపూడి కాంతారావు, ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్, టిడిపి కృష్ణాజిల్లా ఎస్సీ విభాగం కార్యదర్శి దొప్పలపూడి నాగేశ్వరరావు, మహేష్ గృహంలో మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించినట్లు రావెళ్ల తెలిపారు.

మంచి పారిశ్రామికవేత్తను కోల్పోవడం బాధాకరం

విశాలాంధ్ర-గన్నవరం : విలువలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న మంచి పారిశ్రామికవేత్త ముక్కామల సురేంద్రబాబు ఆకస్మిక మరణం బాధాకరమని ఆయన లేని లోటు పారిశ్రామిక రంగానికి టీడీపీకి తీర్చలేనిదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.. ఇటీవల మరణించిన సురేంద్రబాబు సంస్మరణ సభ శనివారం ఉదయం గన్నవరంలోని ఏపీ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వెంకట్రావ్ సురేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కుగ్రామం నుంచి వచ్చి పారిశ్రామిక రంగంలో చెరగని ముద్ర వేసిన సురేంద్రబాబు చిరస్మరణీయుడు అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే సురేంద్రబాబు లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని సురేంద్రబాబు ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కామినేని శ్రీనివాస్, నివాళులు అర్పించారు.

భద్రావతీసమేత భావనాఋషి స్వామి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడిలో కృష్ణాజిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షులు కొండవీటి అమర బాలేశ్వరరావు గ్రామ సర్పంచ్. కొండవీటి వెంకట రమణ విజయలక్ష్మి దంపతులు శనివారం ఉదయం శ్రీభద్రావతీ సమేత శ్రీ భావనాఋషిస్వామి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆగమ ప్రతిష్ఠ చార్య, టీటీడీ పండితులు చావలి దుర్గామల్లి కార్జున సిద్ధాంతి (పాప వినాశనం) వేద మంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిద్యాలు నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోస్తాంధ్ర పద్మశాలి సంఘ కో-కన్వీనర్ అందె జగదీష్, సూర్యభవానిదంపతులు, అఖిల భారత పద్మశాలి సంఘ చేనేత విభాగ సభ్యుడు పుడతాచిత్తరంజన్ సాయి, కూచిపూడి గ్రామ పద్మశాలి సంఘ సభ్యులు చెరుకు శ్రీనివాసరావు,తుమ్మా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్

విశాలాంధ్ర-తిరువూరు: సీఎం రిలీఫ్ ఫండ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పుట్రెల పంచాయతీకి నలుగురికి వారి ఆరోగ్య రీత్యా, కుటుంబాల్ని ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి ఆర్థిక సాయంతో కూటమి ప్రభుత్వం అందించడం జరిగింది. పుట్రెల గ్రామ సీనియర్ నాయకులు, మండల పార్టీ కోశాధికారి గాదె వెంకటేశ్వరరావు బూత్ కన్వీనర్ లు, పిల్లి పాపారావు , బొడ్డు మరేశ్వరావు, దార్ల రాజేష్, నాగరాజు, ఉమ్మడి రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు వెన్నుపోటు

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను తుంగలో తొక్కి వెన్నుపోటు పొడిచిందని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కెవి భాస్కరరావు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై రాష్ట్ర వ్యాప్తముగా జరుగుతున్న సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నగరంలోని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో, నగర అధ్యక్షులు బెవర శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం సింగ్ నగర్ , క్రిష్ణ హోటల్, లూనా సెంటర్లలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి కె.వి. భాస్కరరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాము. సంక్షేమ బోర్డు పునఃరుద్ధరిస్తామని చెప్పి విస్మరించారని అన్నారు. . ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల ఉపాధికి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న అనేక నిర్మాణాలలో స్థానిక భవన నిర్మాణ కార్మికులకు తప్పని సరిగా ఉపాధి అవకాశాలు కల్పించే విధముగా గుత్తేదారులకు మార్గదర్శకాలు జారీచేయాలని డిమాండ్ చేసారు.యూనియన్ నగర కార్యదర్శి చీర్ల రామస్వామి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునఃరుద్ధరించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమునకు ఉద్దేశించిన రూ 1200 కోట్ల బోర్డుకు జమచేయాలని, పెండింగ్ లో ఉన్న క్లైములను తక్షణం పరిష్కరించాలని లేని పక్షంలో భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసుపులేటి కోటేశ్వరరావు, చల్లా వెంకటరమణ, రెడపంగు ప్రభుదాస్, బత్తుల దుర్గారావు, పల్లె పెద లక్ష్మయ్య, చిన్న లక్ష్మయ్య, వి అబ్రహం, జాడు మేస్త్రి, ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధికి ప్రకాశ్ ఆర్ట్స్ రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర-విజయవాడ: దుర్గగుడి అభివృద్ధికి ప్రకాశ్ ఆర్ట్స్ అధినేత సుబ్బారావు కుటుంబం ఆలయ అభివృద్ధి ట్రస్టుకు రూ10 లక్షల విరాళం అందించింది. ఈ మేరకు సిడివి సుబ్బారావు, ఆయన సతీమణి పుష్పలత, కుమారుడు వెంకట సత్య ప్రకాష్, కుమార్తె మణి లక్ష్మి రిషిత, తల్లి రామమణి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ట్రస్టు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ , ఆలయ ఈవో శీనా నాయక్ అభినంది, దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం, పంచ హారతులు, అమ్మవారి చిత్రపటాన్ని వారికి అందచేశారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - పమిడిముక్కల: ఇటీవల భీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ కి పెనుమత్స లో కొల్లూరి బేబి కి చెందిన గృహం కూలిపోవడంతో దాత మొవ్వ రామచంద్రరావు (రాము) ఆర్థక సహాయం అందించారు. ఈ సందర్భంగా పి4 పథకం ద్వారా ఎమ్మెల్యే వర్ల కుమార రాజా ప్రోత్సాహం తో దాత రూ.82500లు ఆర్థిక సహాయం అందించారు.సదరు గృహాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార రాజా పరిశీలించి దాత మొవ్వ రాము ని అభినందించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతలకు బియ్యం, సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల లోని రమేష్ డీలర్ షాపు నందు సైక్లోన్ కారణముగా దెబ్బతిన్న చేనేత కుటుంబాలకు 50 కేజీల బియ్యము, కేజీ షుగర్, 1 కే జి పామాయిల్, ప్యాకెట్, 1 కేజీ కందిపప్పు, ఏడి హ్యాండ్లూమ్స్ వారు పంపిన 287 లిస్ట్ కుటుంబాలకు స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రాం (రాజా) చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, శ్రీకాకుళం డి సీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, ఘంటసాల పిఏసిఎస్ చైర్పర్సన్ బండి పరాత్పరరావు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు వరిపాటి వెంకట రామకృష్ణ, తహసిల్దార్ బి విజయప్రసాద్ ఆర్ ఐ శ్రీనివాసరావు, ఘంటసాల వీఆర్వో శ్రీలక్ష్మి తిరుపతమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పంటకాలువలో గల్లంతైన యువకుడు మృతి

విశాలాంధ్ర మచిలీపట్నం బ్యూరో : బందరు మండలం చినయాదర గ్రామంలోని పంట కాలువలో గల్లంతైన అయ్యప్ప భక్తుడు మృతదేహాన్ని పోలీసులు ఎట్టకేలకు గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చినయాదర గ్రామానికి చెందిన రాసంశెట్టి సుధాకర్ (24) తన స్నేహితులతో కలిసి ఇటీవల అయ్యప్ప మాల ధరించాడు. ప్రతిరోజు లానే శుక్రవారం సాయంత్రం పీఠం వద్ద పూజ చేసుకునే కార్యక్రమంలో భాగంగా పంట కాలువలో స్నానం ఆచరించేందుకు తోటి అయ్యప్పలతో కలిసి వెళ్ళాడు. అయ్యప్పలంతా స్నానం ఆచరించి పూజ నిమిత్తం పీఠం వద్దకు చేరుకున్నారు. పూజా కార్యక్రమం ప్రారంభంలో సుధాకర్ లేకపోవడాన్ని గమనించిన తోటి అయ్యప్పలు అనుమానంతో హుటాహుటిన పంటకాలువ వద్దకు వెళ్లారు. పంట కాలువ గట్టుపై సుధాకర్ ద్విచక్ర వాహనం ఉండడంతో పాటు అతని దుస్తులు గట్టుపైన కనిపించాయి. మరింత అనుమానం వచ్చిన అయ్యప్పలు విషయాన్నీ కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. సుధాకర్ పంటకాలువలో గల్లంతయినట్లు తెలుసుకున్న గ్రామ పెద్దలు కాలువ వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. నిన్న సాయంత్రం 6 గంటల నుండి గాలింపు చర్యలు చేపట్టగా చిన్నయాదర గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని కొత్త వాడపాలెం 9/8 కాలువ వద్ద రెస్క్యూ టీం సిబ్బంది సుధాకర్ మృతదేహాన్ని గుర్తించారు. పంట కాలువలో పడి సుధాకర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా విలపించారు. సుధాకర్ మృతితో చిన్న యాదర గ్రామం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు రూరల్ ఎస్సై నాగరాజు తెలిపారు..

డాక్యుమెంట్లు పోయినవి

విజయవాడ, కానూరు సాయిబాబా గుడి దగ్గర నా స్కూటర్ నెం. AP-16-FJ0458 సెంబరుగల స్కూటర్‌లో ఉన్న బ్యాగ్ 18.10.2025 తేదీన పోయినది. అందులో నా పాస్‌పోర్ట్ నెం.U1741013 ఇంకా కొన్ని డాక్యుమెంట్స్ పోయినవి. ఎవరికి అయినా దొరికితే క్రింది ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేయగలరు. (ముడుసు చిరంజీవి రెడ్డి).

ఫోన్: 93980 59298

CHANGE OF NAME

I, MORLA SRIHARI (Old Name), S/o MORLA NAGESWARA RAO, Resident of Plot No. 229, Rajiv Nagar, Payakapuram, Near Water Tank, Azit Singh Nagar, Vijayawada, NTR dist, Andhra Pradesh, India., i have changed my name as (New Name) MORLA SRIHARI GOUD S/o. MORLA NAGESWARA RAO. Hereafter my name is known as (New Name) MORLA SRIHARI GOUD S/o. MORLA NAGESWARA RAO.

CHANGE OF SURNAME

I, Urachintala Sasikala (Old Name), D/o. M Kesava Rao resident at Flat No. 503, Sunrise Enclave, Reach Road, Sri Krishna Nagar, Opp. SBI Bank, Near RTC Busstand, Gannavaram, Krishna District, A.P., India. I have correction my surname to Macharla Sasikala (New Name) Hence forth, I will be known as MACHARLA SASIKALA

CHANGE OF NAME

I KRUPALI R TALATI (Old Name) W/o Ronak Kumar D Talati, resident of D.No :40-17-181, Flat No:5, Siva Sai Sadan Apartment, BrundavanColony, Vijayawada-520010, NTR District, Andhra Pradesh. I have changed my name as KRUPALI RONAK KUMAR TALATI (New Name) W/o Ronak Kumar D Talati. Here after my name is known as KRUPALI RONAK KUMAR TALATI(New Name) W/o Ronak Kumar D Talati. for all future purposes .

CHANGE OF NAME

I DHRUTI R TALATI (Old Name) D/o Ronak Kumar D Talati, resident of D.No :40-17-181, Flat No:5, Siva Sai SadanApartment, BrundavanColony, Vijayawada-520010, NTR District, Andhra Pradesh. I have changed my name as DHRUTI RONAK TALATI (New Name) D/o Ronak Kumar D Talati. Here after my name is known as DHRUTI RONAK TALATI (New Name) D/o Ronak Kumar D Talati. for all future purposes .

CHANGE OF NAME

I KHUSHBOO S TALATI (Old Name) W/o Sanket Kumar D Talati, resident of D.No :40-17-181, Flat No:5, Siva Sai SadanApartment, BrundavanColony, Vijayawada-520010, NTR District, Andhra Pradesh. I have changed my name as KHUSHBOO SANKET TALATI (New Name) W/o Sanket Kumar D Talati. Here after my name is known as KHUSHBOO SANKET TALATI (New Name) W/o Sanket Kumar D Talati. for all future purposes

రైతులకు న్యాయం చేసేందుకు కృషి : ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర-చల్లపల్లి : రైతులకు న్యాయం చేసేందుకు అహర్నిశలు కృషిచేస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టంచేశారు. శనివారం చల్లపల్లి సొసైటీ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, మొంథా తుఫాను ప్రభావానికి పడిపోయిన చేలు మాత్రమే కాకుండా, నిలబడి ఉన్న చేలలో కూడా దిగుబడి తగ్గే అంశాన్ని తాను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. వారిద్దరూ పంటనష్టం అంచనాలలో మానవతా దృక్పథంతో రైతులకు వెసులుబాటు కల్పించి న్యాయం జరిగేలా చూస్తామని హామీఇచ్చారని చెప్పారు. కోతల సమయంలో తుఫాన్లు, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో రైతులెవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, మండలి వెంకట్రామ్, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్కుమార్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏవో కె.మురళీకృష్ణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తుమ్మల చౌదరిబాబు, సీఈవో తోట కృష్ణారావు, డైరెక్టర్లు వేముల హరికృష్ణ, నేతలు షేక్ నబీఘోరీ, మోర్ల శివ, ఏపి.చంద్రశేఖరరావు, అంబటి భువనేశ్వరరావు, ఉరిమి మణికాంత్, మిరియాల జితేంద్ర, రావి రాజు, మాజేరు సీఈవో చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత బాలుడికి మైత్రి ఫౌండేషన్ వైద్య సహాయం

విశాలాంధ్ర -మచిలీపట్నం : సమాజ సేవలో అగ్రగామిగా నిలుస్తున్న మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ మరో సార్థకమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. పెడన మండలం రాజీవ్ నగర్ ప్రాంతానికి చెందిన బైలపాటి అంకమ్మరావు కుమారుడు బైలపాటి హర్షవర్ధన్ బాబు గత రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నిరంతర వైద్య చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబం చేసిన అభ్యర్థన మేరకు, ఫౌండేషన్ బృందం కుటుంబాన్ని ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించింది. తదనంతరం, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం రెండు నెలలకు సరిపడా 10 వేలు విలువైన మెడిసిన్స్ కొనుగోలు చేసి కుటుంబ సభ్యులకు శనివారం అందజేసింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఏ.ఆర్.కే. వరప్రసాద్ , ఉపాధ్యక్షులు రిలాక్స్, టీ ప్రసాద్ , ఫుడ్ కమిటీ చైర్మన్ చొప్పర అనిల్ , గౌరవ సభ్యులు రామకృష్ణ మాస్టారు పాల్గొని సానుభూతిని తెలిపారు.

ఏకదంతునికి సంకటహర చతుర్థి పూజలు

విశాలాంధ్ర-కూచిపూడి : సంకటహర చతుర్థి సందర్భంగా శనివారం ప్రదోష సమయంలో దేవాలయాలలో విశేష పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరునికి ప్రతినెల పౌర్ణమి తర్వాత వచ్చే బహుళ చవితిఅత్యంతప్రీతికరమైన రోజుకావడంతో ప్రత్యేకంగా గణనాధునికిఅభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకారాలు ఆకర్షణీయంగా చేశారు. కార్తీక మాసంలో శనివారం మధ్యాహ్నం నుంచి చవితి ప్రవేశించి ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగానే సాయంకాల వేళలో కూచిపూడిలోని శ్రీ గంగా బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలోక్షి గణపతికి, కూచిపూడి పెదపూడి వర్తక సంఘకళ్యాణ మండపంలోనిసంపత్ గణపతి దేవాలయంలో, విద్యా గణపతికి ఆయా దేవాలయాల అర్చకులు పెనుమూడి సతీష్ కుమార్ శర్మ, పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, పెనుమూడి సుబ్రహ్మణ్య శాస్త్రి (బాబి) అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా రేడియాలజీ డే

విశాలాంధ్ర, మచిలీపట్నం : అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం ప్రభుత్వ హాస్పిటల్ నందు రేడియాలజీ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ బి ఆశాలత మాట్లాడుతూ రేడియేషన్ వలన జరిగే ఉపయోగాలు నష్టాలను ప్రమాదాలను సెమినార్ ద్వారా వివరించడం జరిగినది, ప్రస్తుతం అనేక రకాల స్కానింగ్ మిషన్ల ద్వారా అనవసరంగా ఎక్స్రేలు స్కానింగ్లు తీయించుకోకూడదని తద్వారా అవి క్యాన్సర్ కి దారి తీసే విధానాన్ని ఈ సెమినార్ ద్వారా తెలియజేయడం స్టాఫ్, కళాశాల విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. తొలుత ఎక్స్రే కిరణాలను కనుగొన్న శాస్త్రవేత్త విలియం. రాంటీజన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ డాక్టర్ నిరంజన్, డిప్యూటీ సూపర్నెంట్ డాక్టర్ శ్రీనివాస్, రేడియాలజీ సేఫ్టీ ఆఫీసర్ కరెడ్ల. అంజని కుమార్ రేడియాలజీ డిపార్ట్మెంట్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధిత కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర-కూచిపూడి : గత నెలలో మూడు రోజులు పాటు సంభవించిన మొంథా తుఫాను సందర్భంగా వీచిన గాలులకుమొవ్వ మండలం కాజ గ్రామంలో జాతురున్నీసా ఇంటిపై తాడిచెట్టు పడి ధ్వంస మమటంతో శుక్రవారం రాత్రి వారి కుటుంబ సభ్యులను పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించి కూటమి నాయకుల సహకారంతో ఆర్థిక సహకారాన్ని అందజేశారు. అలాగే తుపాను కారణంగా దెబ్బతిన్న ఈ ఇంటికి ప్రభుత్వం 10 వేల రూపాయలనష్టపరిహారంగా అందించినట్లు నాయకులు తెలిపారు. అంతకు ముందుగాపి-4పథకం ద్వారా చదువుల నిమిత్తం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ, కాజా నీటి వినియోగదారుల సంఘఅధ్యక్షుడు తాతా నారాయణరావు, మోకా వెంకటేశ్వర్ రావు అందించిన 20వేలరూపాయల ఆర్థిక సహాయాన్ని నలుగురు పేద విద్యార్థులకు చదువునిమిత్తం ఐదేసి వేల రూపాయల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేనీ రామలింగేశ్వర రావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

కనుల పండువగా యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ

- నూతన ఒరవడి దిశగా తెలుగు కథోలిక శ్రీభ

- ఆర్చి బిషప్ ఉడుమల బాల

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : తెలుగుగడ్డపై యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లి వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కథోలిక శ్రీసభ నూతన ఒరవడి దిశగా అడుగులు వేస్తూ విరాజిల్లుతోందని విశాఖపట్నం అగ్రపీఠాధిపతులు (ఆర్చి బిషప్) ఉడుమల బాల స్పష్టం చేశారు. ఆంధ్ర లయోలా కళాశాల ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో శనివారం ఉదయం ఆర్చి బిషప్ ఉడుమల బాల, విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన బిషప్లు జ్యోతి ప్రజ్వలన చేసి యేసుక్రీస్తు జయంతి 2025 వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఆర్చి బిషప్ ఉడుమల బాల తదితర బిషప్లు జూబిలీ వేడుకల 2025 జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్చి బిషప్ ఉడుమల బాల మాట్లాడుతూ 2025 యేసుక్రీస్తు జయంతి జూబిలీ వేడుకలు తేనెలొలికే తెలుగుగడ్డపై చారిత్రాత్మక ఘట్టంగా మిగిలుతుందన్నారు. విజయవాడ కథోలిక పీఠం, జూబిలీ వేడుకల కన్వీనర్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ దివంగత పోప్ ఫ్రాన్సిస్ 2025 ఈ ఏడాది యేసు క్రీస్తు జయంతి 2025 జూబిలీ వేడుకల సంవత్సరంగా ప్రకటించిందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా జరిగే క్రీస్తు జూబిలీ 2025 వేడుకలలో భాగంగా విశాఖపట్నం అగ్రపీఠం పరిధిలోని 6 కథోలిక మేత్రాసనాలు ఒక వేదిక మీదకు రావటం అందుకు విజయవాడ కథోలిక పీఠం ప్రాతినిధ్యం వహించటం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం ఆర్చి బిషప్ ఉడుమల బాల, ఏలూరు కథోలిక పీఠం బిషప్ పొలిమేర జయరాము, నెల్లూరు కతోలిక పీఠం బిషప్ యం.డి. ప్రకాశం, గుంటూరు కతోలిక పీఠం బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, నెల్లూరు సహాయ బిషప్ పిల్లి అంతోనిదాస్, విజయవాడ కతోలిక పీఠం బిషప్ టి. జోసఫ్ రాజారావు, శ్రీకాకుళం కథోలిక పీఠం బిషప్ రాయరాల విజయకుమార్, కర్నూలు కతోలిక పీఠం బిషప్ గోరంట్ల జానేసు, ఖమ్మం కథోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్, నల్గొండ కతోలిక పీఠం బిషప్ కరణం ధమన్ కుమార్, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, సెయింట్ జాన్స్ సెమినరీ ప్రొఫెసర్ ఫాదర్ వల్లె విజయ జోజిబాబు తదితరులు ఆయా కేథలిక్ డయోసిస్లలో శ్రీసభ ఆశయాలు లక్ష్యాలు, క్రీస్తు జూబిలీ వేడుకల గురించి తమతమ ప్రసంగాలలో వివరించారు. ఈ సందర్భంగా ఆర్చి బిషప్ ఉడుముల బాల, ఆంధ్ర తెలంగాణ నుండి వచ్చిన బిషప్లను వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ శాలువాలతో సత్కరించి మెమోంటోలు ఇచ్చారు. క్రీస్తుజయంతి జూబిలీ వేడుకల కృతజ్ఞత సమిష్టి దివ్యపూజాబలిని ఆర్చి బిషప్ ఉడుముల బాల, బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, తెలుగు రాష్ట్రాల బిషప్లు గురువులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ వల్లె జోజిబాబు, ఎడ్యుకేషనల్ డస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, తెలుగు రాష్ట్రాలనుండి వచ్చిన ఫాదర్స్, సిస్టర్స్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కలకు ఆహారం పెట్టే ప్రత్యేక ప్రదేశాల ఏర్పాటు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కల కోసం ప్రత్యేకంగా ఆహారం పెట్టే ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు దీనిని గమనించి కేవలం కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వీధి కుక్కలకు ఆహారం పెట్టాలని నగర ప్రజలను కోరారు. నగర ప్రజలు కూడా దీనికి సహకరించి కేవలం వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశాల్లోనే ఆహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీకనకదాస్ జయంతికి నివాళులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : భక్త కనకదాసు ప్రధాన రచనలు కన్నడంలో రచించిరట్లు అదనపు కమిషనర్ ఏ.రవీంద్ర రావు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద శ్రీకనకదాసు జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భక్త కనసాదాసు 516వ జయంతి వేడుకల్లో సందర్భంగా భక్త కనకదాసు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకునే ఆవశ్యకత ఉందని, కనకదాసు నరసింహ స్తోత్రం, రామధ్యాయ మంత్రం, మోహన తరంగిణిని రచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఏఎంవోహెచ్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్ ఏ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో భాగస్వామి కావాలి

టి.పి.ఓ. వసీమ్ బేగ్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రతి పౌరుడు పట్టణాభివృద్ధిలో భాగస్వామి కావాలని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ వసీమ్ బేగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ టౌన్ ప్లానింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్టిసి కాలనీలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం సొసైటీ-ఫన్ టైమ్స్‌లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టౌన్‌ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ అజయ్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వసీమ్ బేగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫన్ టైమ్స్ కాలనీ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.పి.ఓ. వసీమ్ బేగ్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ పట్టణాభివృద్ధి అనేది ప్రభుత్వ ప్రణాళికలతో పాటు ప్రజల సహకారం మీద ఆధారపడి ఉంటుందని, ప్రతి పౌరుడు పట్టణాభివృద్ధిలో భాగస్వామిగా మారాలని ఆయన కోరారు. అధికారులు ప్రజల అడిగిన సందేహాలకు సమాధానమిచ్చి, ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధిపై అవగాహన కల్పించారు. స్థానికుల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

వైభంగా శ్రీలక్ష్మి గణపతి హోమం

విశాలాంధ్ర - గుడివాడ : మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర దేవాలయంలో సంకటహర చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవస్థాన మండపంలో శనివారం శ్రీ లక్ష్మీ గణపతి హెూమ పూజలు 130 మంది దంపతుల జంటలు పీటలపై కూర్చొని పూజలు చేశారు. శ్రీ సంకటహర చతుర్దశి పర్వదినం, పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని లోక కళ్యాణార్థం దేవాలయంలో లక్ష్మీ గణపతి హెూమ పూజలు నిర్వహించారు.

ఒత్తిడి నుంచి ఉపశమనానికి క్రీడలు దోహదం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పనిఒత్తిడి నుంచి ఉపశమనం కోసం క్రీడలు దోహదం చేస్తాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్(ఏపీ అండ్ టీఎస్) 77వ వార్షికోత్సవం సందర్భంగా తారక్ దా సెంచూరియన్ మెమోరియల్ ఇంటర్ జోన్ క్రికెట్ రెండు రోజుల టోర్నమెంట్ శనివారం జేకేసీ కళాశాల క్రికెట్ మైదానంలో ఉత్సాహవంతమైన వాతావరణంలో ప్రారంభమైంది. ఇండియన్ బ్యాంక్ అమరావతి జోనల్ మేనేజర్ గౌరీశంకర్ క్రీడలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఇండియన్ బ్యాంకులోని ఎనిమిది జోన్స్ నుంచి ఎనిమిది జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ సేవలను కొనియాడారు. బ్యాంక్ ఉద్యోగుల కోసం క్రీడలను నిర్వహిస్తున్న యూనియన్ నాయకులను అభినందించారు. గౌరీశంకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో బ్యాంకు ప్రగతి పథంలో ముందుకు వెళ్ళుతుందని, బ్యాంక్ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి తనవంతు సహకారం అందించాలని కోరారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ అమరావతి జోన్ డిప్యూటీ జోనల్ మేనేజర్ కె.కృష్ణమోహన్ మాట్లాడుతూ మహిళా ఇండియన్ క్రికెట్ టీమ్ సాధించిన విజయాన్ని గుర్తుచేస్తూ క్రీడాకారులలో స్ఫూర్తినింపారు. ప్రధాన కార్యదర్శి పీవీ కృష్ణారావు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకు చరిత్రను విపులంగా వివరించారు. మన్యం శివనాగుమల్లేశ్వరరావు(మల్లిబాబు) మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. చైర్మన్ రాధాకృష్ణ, అమరావతి జోన్ జాయింట్ జనరల్ సెక్రెటరీ కె.రామకృష్ణ, నల్లపురెడ్డి, కొల్లి అనిల్ కుమార్, ప్రభు, కిషోర్, శివకృష్ణ, లోకేష్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-తాడికొండ : స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం మార్కెట్ యార్డ్ చైర్మన్ నీలాల ధనలక్ష్మి కృష్ణారావు, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం జరుగుతోందని యార్డు కార్యదర్శి పి.రజని శనివారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరవుతారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమాణస్వీకారం ఉత్సవంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్ఓసీ చెక్కులు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న తాడేపల్లి 19వ వార్డు కేఎల్ రావు కాలనీకి చెందిన చల్లా వెంకటేశ్వర్లుకి రూ.2 లక్షలు, అలాగే 12వ వార్డు నులకపేటకు చెందిన షేక్ సైదావలికి రూ.1.50 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) మంజూరైంది. శనివారం టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, భాధితుల ఇంటికి వెళ్ళి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, కొమరం చిన్నబచ్చయ్య, సైకం సాంబయ్య, షేక్ అమీర్, కొయ్యగోర మల్లేశ్వరరావు, షేక్ మస్తానయ్య, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కనకదాసు జయంతి ఉత్సవం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో భారతీయ తత్వవేత్త, సంగీతకారుడు, కవి శ్రీ భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కనకదాసు చిత్రపటానికి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సాధికారత అధికారి మయూరి, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ, రాష్ట్ర నాయి బ్రహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరరావు, రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ దేవుళ్ళ మల్లికార్జునరావు, కురుబ కుల సంక్షేమ సంఘం నాయకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సాధికారత అధికారి మయూరి మాట్లాడుతూ శ్రీ భక్త కనకదాసు గొప్ప భక్తుడు, ఆధునిక కవి, సామాజిక తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ అధికారి భవాని, కురుబ కుల సంక్షేమ సంఘం నాయకులు లంబు రామాంజనేయులు, బుడ్డా వీరయ్య, ధనసిరి శివశంకరరావు, బుడ్డా వీరమల్లేశ్వరరావు, బక్కా శ్రీనివాసరావు, మర్రి సత్యనారాయణ, బక్కా ఉమామహేశ్వరరావు, పారె వెంకట నాగరాజు, బీసీ నాయకులు వి.శ్రీనివాసరావు, గీతలక్ష్మి, బక్కా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తిదారులు మట్టి తెచ్చుకునేందుకు ఆటంకాలు తొలగించండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు ఇందుర్తి శివన్నారాయణ ఆధ్వర్యంలో తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌ను నాయకులు కలిశారు. కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం తాడికొండ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు వరికళ్ళు నాగమల్లేశ్వరరావు, ఫిరంగిపురం మండల కమిటీ అధ్యక్షులు మొగిలిపాలెం ఏడుకొండలు, తాడికొండ మండల అధ్యక్షులు పుసులూరి ముత్యాలరావు, కమిటీ సభ్యులను ఎమ్మెల్యేకు పరిచయం చేయడం జరిగింది. కులవృత్తి కోసమై మట్టిని తెచ్చుకొనుటకు అభ్యంతరములు పెడుతున్నారని సంఘీయులు తెలుపగా అందుకు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సానుకూలంగా స్పందించి కులవృత్తిదారులు మట్టి తెచ్చుకునేందుకు ఎవరు ఆటంకం కల్పించకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు. గుంటూరు నగరంలో శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు అనుమతి ఇవ్వాలని సంఘీయులు కోరారు.

అవార్డు అందుకున్న తిరుమలశెట్టి ఉమాశంకర్

విశాలాంధ్ర-పొన్నూరు : ఆంధ్రప్రదేశ్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖపట్నంలోని పబ్లిక్ లైబ్రరీలో మొదటి వార్షికోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నాన్ గవర్నమెంట్ గుంటూరు జిల్లా అధ్యక్షులుగా ఉన్న తిరుమలశెట్టి ఉమాశంకర్‌కి శ్రీ శంఖబ్రత బాగ్చి విశాఖ పోలీస్ కమీషనర్, కర్రి స్వామి సీఈవో ఆయుష్మాన్ హాస్పటల్ పమిడి శంకర్ రావు సర్పంచ్ జనసేన, ఆంధ్రప్రదేశ్ నాన్ గవర్నమెంట్ అధ్యక్షులు శంకర్ నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోవటం జరిగింది. వైజాగ్‌లోనే తాసుబెల్లి ఫౌండేషన్ నుంచి ఉత్తమ బ్లడ్ డొనేషన్ అవార్డ్స్ అందుకున్న తిరుమలశెట్టి ఉమాశంకర్ చిలకపాటి సింహాద్రికి బ్లడ్ డొనేషన్ అవార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ ఏపీ నాన్ గవర్నమెంట్ అధ్యక్షులు శంకర్ నాయుడుకి మిగతా ఎన్జీవోస్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రక్తం అందించిన ప్రతి దాతకి అంకితమని అన్నారు.

యువతకు ఉపాధి అవకాశాల
ఘనత చంద్రబాబుదే: లాల్ వజీర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : యువత భవిష్యత్ కోసం మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొస్తున్నారని, ఈ అవకాశాన్ని మైనార్టీలు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.లాల్ వజీర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షేక్.లాల్ వజీర్ మాట్లాడుతూ గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు స్థాపించి రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం 16 వేల పోస్టులకు డిఎస్సీ నిర్వహించి అందులో 6 వేల పోస్టులలో మైనార్టీలను, నూర్‌బాషాలను తీసుకున్న ఘనత నారా లోకేష్‌దేనని పేర్కొన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు ఆస్తులన్నీ తిరిగి వక్ఫ్ బోర్డుకు చెందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దీనిని మైనార్టీ సోదరులు గమనించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంలో మైనార్టీ సోదరులు ఎక్కువ లబ్ధి పొందుతున్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు, నూర్‌బాషా కార్పొరేషన్ల ద్వారా రాబోయే రోజుల్లో వడ్డీ లేని రుణ సదుపాయం కూడా కల్పిస్తుందని అన్నారు. మైనార్టీలను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి కెఎంఈ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ రెడ్డి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు బాజీ మాస్టర్, అబ్దుల్ ఖాదర్, ఇలాహి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్స్

విశాలాంధ్ర-తెనాలి : అమరావతి కాలనీలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల సెలక్షన్స్ శనివారం జరిగింది. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల నుండి జిల్లా జట్లులోని క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి మల్లిఖార్జునరావు తెలిపారు. అసోసియేషన్ నాయకులు ఉదయ్, అడపా సంపత్ రాయుడు, సీనియర్ లిఫ్టర్లు పాల్గొని ఎంపికైన 15 మంది క్రీడాకారులను అభినందించారు.

స్విమ్మింగ్ పోటీల్లో వడ్డేశ్వరం జడ్పీ బాలికల హవా

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినిలు మూడు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్ నజరీన్, షేక్ నస్రీన్‌లు తమ ప్రతిభను కనబరిచి, విజయాలు సాధించడమే కాక, జిల్లా పరిషత్ హైస్కూల్‌కు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని ఆయన అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి శక్తివంచన లేకుండా కృషిచేసి విజయాలు సాధించాలని ఆయన కోరారు. విజయాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నూతక్కి రవి, మెల్లంపూడి రవి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన ఇద్దరు క్రీడాకారులు అక్కాచెల్లెళ్లు కావడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పలువురు గ్రామస్తులు ఎస్‌కే నజరీన్, ఎస్‌కే నస్రీన్‌లను అభినందించారు.

తల్లి కళ్ల ముందే కొడుకు హత్య

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండలంలో జరిగిన హృదయ విదారక ఘటన స్థానికులను కుదిపేసింది. కన్నతల్లి కళ్ల ఎదుటే కొడుకు వీరబాబు అలియాస్ వీరయ్య(37)ను ఇద్దరు యువకులు కత్తితో దారుణంగా హత్య చేశారు. పోలీసులు వివరాల ప్రకారం చింతలపూడికి చెందిన నవీన్, కృష్ణ అనే యువకులు రూ.10 వేలు అప్పు ఇచ్చేందుకు నిరాకరించడాన్ని కారణంగా చూపుతూ శుక్రవారం రాత్రి వీరయ్యపై దాడి చేశారు. రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో వీరయ్య తన తల్లితో కలిసి స్థానిక ప్రథమ చికిత్స కేంద్రానికి వెళ్తుండగా, నిందితులు బండిపై వచ్చి కత్తులతో దాడి చేసి హత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జ్ సీఐ వీరస్వామి, పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. మృతుని భార్య వివరాల ప్రకారం నవీన్ ప్రతి శనివారం వీరయ్య దగ్గర డబ్బులు తీసుకుని చికెన్ దుకాణం నడిపేవాడు. చికెన్ అమ్మకాలు జరిగిన తరువాత డబ్బులు తిరిగి చెల్లించే పద్ధతిలో ఉండేవారు. ఈ క్రమంలో శుక్రవారం మరిన్ని డబ్బులు ఇవ్వమని అడగగా వీరయ్య నిరాకరించడంతో వాగ్వాదం జరిగి హత్యకు దారి తీసిందని ఆమె తెలిపింది.

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో 'మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను ఆ పార్టీ పి.ఏ.సి మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వైద్య విద్య వ్యవస్థను ధ్వంసం చేసే చర్య అని పేర్కొంటూ, వైద్య విద్య అందరికీ అందుబాటులో ఉండేలా కృషి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు, యువత, పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అలాగే ఈ నెల 12న ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీగా వెళ్లి మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేయనున్నట్లు బ్రహ్మనాయుడు తెలిపారు.

అండర్ పాసేజ్ నిర్మాణం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నూతనంగా నిర్మించిన "ఒడరేవు బి నకరికల్లు" బైపాస్ రోడ్డులో పసుమర్రు నుండి ఇంజనంపాడు వెళ్లే మార్గంలో అండర్ పాసేజ్ నిర్మాణం చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన మేరకు డిజైన్లు మార్పులు చేయాలని, సూచిక బోర్డులు తక్షణమే ఏర్పాటు చేయాలని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ కోరారు. ఈరోజు పసుమర్రు, ఇంజనంపాడు గ్రామ ప్రజలతో కలిసి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు చనిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. డిజైన్లలో లోపం వలనే రోడ్డు ప్రమాదం జరిగి, రెండు ప్రాణాలు పోయాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న అధికారులు తగు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను, తీసుకోవాల్సిన చర్యల గురించి నేషనల్ హైవేస్ అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనంపాడు గ్రామ సర్పంచ్ తూబాటి బాలకృష్ణ, పసుమర్రు, ఇంజనంపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించేందుకు పన్నాగం

విశాలాంధ్ర- పెదకూరపాడు : మండల పరిధిలోని జలాలపురం గ్రామానికి చెందిన సరిపూడి రామారావుకు చెందిన ఎకరం48 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన పువ్వాడ కిషోర్ తండ్రి సాంబశివరావు అన్యాక్రాంతంగా ఆక్రమించుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి చేను చుట్టూ స్తంభాలు పాతారని రామారావు ఆరోపించారు. గత కొద్దిరోజులుగా తన భూమి లాక్కునేందుకు పన్నాగాలు చేస్తూ కిషోర్ కోర్టులో దావా వేశారని రామారావు తెలిపారు. కోర్టులో నడుస్తుండగానే ఎలాంటి అనుమతులు లేకుండా సర్వేయర్‌ను తీసుకువెళ్లి మరో పదిమందితో కలిసి చేను చుట్టూ ఫెన్సింగ్ రాళ్లు వేశారని రామారావు తెలిపారు. కోర్టులో ఉండగా రాళ్లు ఎందుకు వేస్తున్నామని అడిగేందుకు వెళ్లిన అతని భార్యపై గడ్డ పలుకుతో దాడికి ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయమై పెదకూరపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు కూడా ఇచ్చామని తమకు ప్రాణహాని ఉందని తమకు న్యాయం చేయాలని రామారావు కోరారు.

యామర్తి శ్రీనుకు నివాళి

విశాలాంధ్ర- రాజుపాలెం: ఉప్పలపాడు గ్రామానికి చెందిన యామర్తి శ్రీను గుండెపోటుకు గురై మరణించారు. సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ఉప్పలపాడు గ్రామానికి వెళ్లి శ్రీను భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వీరి వెంట నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రోడ్ల పైనే గేదెలు... రాకపోకలకు ఇబ్బందులు

విశాలాంధ్ర- పెదకూరపాడు: మండల కేంద్రంలోని తెలుగు బాప్టి చర్చ్ కి వెళ్లే దారిలో సత్తార్ ఇంటి సమీపంలో రోడ్లపైనే గేదెలు కట్టేస్తున్నారని కంచర్ల వారి వీధి ప్రజలు తెలిపారు. ఇరుకు రోడ్లు ఆ రోడ్లపైనే గేదెలు వచ్చే పోయే వాడికి ఇబ్బందులు కలుగుతుందని వారన్నారు. విశాలాంధ్ర వార్తకు స్పందించి పంచాయతీ అధికారులు స్పందించి రోడ్లపై గేదెలు కట్టే వేయకుండా తగు చర్యలు తీసుకోవాలి అని కాలనీవాసులు కోరారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం 15వ వార్డులో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువను ప్రారంభించారు. అదే విధంగా శాలివాహన నగర్‌లో చేపట్టిన సీసీ డ్రైనేజీ పనులను కూడా లాంఛనంగా ప్రారంభించారు. వజ్రం రెస్టారెంట్ నుండి సాయిరామ్ ఆటోమొబైల్స్ వరకు నిర్మించిన రోడ్డు, అలాగే శాలివాహన నగర్‌లో అమలు చేస్తున్న డ్రైనేజీ వ్యవస్థ పట్టణ ప్రజలు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల, రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం మా ప్రభుత్వ ప్రాధాన్యత, అభివృద్ధి అంటే కేవలం మాటలు కాదు, ప్రజలకు కనబడే విధంగా జరిగే పనులు. వర్షాకాలంలో దుర్గంధం, నీటి నిల్వలు, వ్యాధుల సమస్యలు శాలివాహన నగర్‌లో సంవత్సరాలుగా కొనసాగాయి. ఈ సీసీ డ్రైనేజీ ద్వారా ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పట్టణంలో ప్రతి వార్డును పరిశీలించి, అవసరాల ప్రాతిపదికన రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధిని దశల వారీగా కొనసాగిస్తున్నాం. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల పాలుపంచుకోవడం, వారి అభిప్రాయాలు తీసుకోవడం, పనులను వేగం-నాణ్యతతో పూర్తి చేయడం ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, పట్టణ నాయకులు, మున్సిపల్ అధికారులు, జనసేన, బిజెపి, టిడిపి పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మాచర్ల : మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసన సభ్యులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మా రెడ్డి అన్నారు. శనివారం 6.20 లక్షల చేప పిల్లలను మండలంలోని పెద్ద అనుపులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయంలో మత్స్యకార సంక్షేమాన్ని గాలికొదిలేసి, దాదాపు 11 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వేట నిషేధం సమయంలో అందిస్తున్న రూ. 10 వేల సాయాన్ని రూ. 20 వేలకు పెంచి, కూటమి ప్రభుత్వం అందిస్తోందని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీ, మత్స్యశాఖ డీ.ఎఫ్.వో సంజీవ్ రావు, తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎస్సై అశోక్, మత్స్యశాఖ ఇన్స్‌పెక్టర్ లు శ్రీనివాసరావు, పిల్లి వెంకట్రావు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, సభ్యులు దేవుడు, నర్సింహులు, సింహాద్రి, భూలోక్, టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్, నాయకులు శేరెడ్డి గోపిరెడ్డి, కోటయ్య, వెంకటేశ్వర్లు, వీరస్వామి, స్వామీ నాయక్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పై అవగాహన

విశాలాంధ్ర-యడ్లపాడు: వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లపై తిమ్మాపురం గ్రామానికి చెందిన నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణ కుమారి మండలంలోని పాఠశాలలో శనివారం అవగాహన కల్పించారు. కొండవీడు, కోట, తదితర గ్రామాలలోని పాఠశాల విద్యార్థిని లతో మమేకమై పలు అంశాలను వివరించారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎందేటి ప్రసాద రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాఖమూరి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- పెదకూరపాడు: తమ తల్లి పేరు మీద ఉన్న పది ఎకరాల భూమిని శాఖమూరి శ్రీనివాస్ అనే వ్యక్తి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని తనపై చర్యలు తీసుకోవాలని అచ్చంపేట మండలం కోనూరుకు చెందిన పసుపులేటి జనార్దన్ రావు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. అమరావతిలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో తమభూమి తమకు ఆన్లైన్ చేయాలని కోరారు. తమ తల్లి పసుపులేటి రాజ్యలక్ష్మి పేరుతో 40 సంవత్సరాల క్రితం కస్తల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి నుండి పది ఎకరాల భూమిని కొనుగోలు చేశారని అప్పటి నుండి ఆ భూమిని తామే సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు శాఖమూరి శ్రీనివాస్ నకిలీ పేపర్లను సృష్టించి తమ భూమిని ఆన్లైన్ నుండి తొలగించారన్నారు. దీనిపై గతంలో ముఖ్యమంత్రి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర- వినుకొండ: పట్టణంలోని జాషువా కళా ప్రాంగణం నందు, పేద ప్రజలకు కంటి చూపు సమస్యలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరం శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శిబిరాన్ని ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సులభంగా, ఉచితంగా వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన సంకల్పం అన్నారు. ముఖ్యంగా కంటి చూపు కోల్పోయే ప్రమాదంలో ఉన్న పేద కుటుంబాలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఆత్మీయ సహాయం అందిస్తున్నాయి. వైద్యులు, సేవా సంస్థలు, ఫౌండేషన్లు ప్రజల ఆరోగ్యానికి అంకితభావంతో పనిచేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, వైద్య సిబ్బంది, సేవా సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, సాంఘిక కార్యకర్తలు, శివశక్తి మేనేజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- అమరావతి: రాష్ట్రంలో పెద్దకూరపాడు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కూటమి నాయకులు ఉన్నత అధికారులు ప్రజల సహకారంతో సమిష్టి ఆలోచనతో ముందు భాగాన్న నిలవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన అమరావతి లో ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రెవిన్యూ సమస్యలు, స్థానిక మౌలిక సదుపాయాల సమస్యలు, రోడ్లు వివిధ అంశాలపై పెద్ద ఎత్తున ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఎం.డానేలు, ప్రజా ప్రతినిధులు పంచాయితీరాజ్ అధికారులు, ఎంపీడీవో టీ పార్వతి, వివిధ సెక్టార్లకు చెందిన అధికారులు, అనధికారులు అంగన్వాడి, డ్వాక్రా ఆశా కార్యకర్తలతో పాటు పార్టీ నాయకులు ఎస్ కే జానీ, కే వసంతరావు, ఎం విష్ణు శౌరి, వెంకటేశ్వర్లు, పి వెంకటేశ్వర్లుకార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిత్రకారులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర-వినుకొండ : చిత్రకారులు డా.వజ్రగిరి జెస్టిస్ వద్ద చిత్రకళలో శిక్షణ పొందుతున్న రావులపాటి విజయ గీసిన "నాట్య రాణి" చిత్రానికి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గోకనకొండకు చెందిన చిత్రకారుడు గీసిన "వ్యవసాయ స్త్రీ: చిత్రానికి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఈ నెల 3న జరిగిన "మన సంస్కృతి" చిత్రకళా ప్రదర్శన మరియు స్మృతి పురస్కారాలలో భాగంగా ఈ అవార్డులు అందుకున్నారు. మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, ఆర్ట్ గిల్డ్ అధ్యక్షులు శ్రీ బి.ఎ.రెడ్డి, రాష్ట్ర సంస్కృత, తెలుగు అకాడమీ అధ్యక్షులు శరత్చంద్ర, రాష్ట్ర క్రియేటివిటీ ఆర్ట్ అకాడమీ అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని, సుభాష్ బాబు, డ్రీమ్ రమేష్ ఈ అవార్డులు అందించారు. కళాకారులుగా వినుకొండకు ఎంతో ఖ్యాతిని తీసుకుని వస్తున్న వీరినీ డా వజ్రగిరి జెస్టిస్, వినుకొండ ప్రముఖ రాజకీయ నాయకులు, కవులు రచయితలు, కళాకారులు, టీచర్స్, పాస్టర్స్, వివిధ కళా సంఘాల నాయకులు అభినందించారు, మరెన్నో అవార్డులు అందుకోవాలని కోరారు.

10,11 తేదీల్లో గుంటూరులో జాతీయ స్థాయి సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరులో జాతీయ స్థాయి సదస్సు ఈ నెల 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు గ్రామీణ మండలం వెంగళాయపాలెంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న వాటర్ షెడ్ మహోత్సవ్ ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు మైలపల్లి కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సీపీ రెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వైవీకే షణ్ముఖ కుమార్‌లతో కలిసి శనివారం కేంద్ర సహాయ మంత్రి పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ సదస్సు గుంటూరులో జరగడం గొప్ప అవకాశం అన్నారు. దీనిని ఒక అవకాశంగా తీసుకుని గుంటూరు పేరు ప్రతిష్టలు మారుమ్రోగే విధంగా ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ప్రతి అంశంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి వాటర్ షెడ్ -పిఎంకెఎస్‌వై జాతీయ సదస్సు (వాటర్ షెడ్ మహోత్సవ్) రెండు రోజుల పాటు 10, 11 తేదీల్లో గుంటూరులో జరుగుతుందని ఆయన చెప్పారు. మొదటి రోజు గుంటూరు ఐటీసీ హోటల్‌లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుందన్నారు. రెండవ రోజు వెంగళాయపాలెంలో జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, అదనపు ఎస్పీ రమణ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం ఎంపీ కృషి: ఈశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు

వైద్యం : అభివృద్ధే ధ్యేయంగా ప్రజా సంక్షేమం కోసం గుంటూరు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతరం కృషి చేస్తున్నారని ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా వెంగళాయపాలెం గ్రామ ప్రజల మంచినీటి చెరువు అభివృద్ధి కల ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో సాకారమయ్యిందన్నారు. వెంగళాయపాలెం చెరువును కనీవినీ ఎరుగని రీతిలో నిర్మాణం చేశారని తెలిపారు. మంచి ఆహ్లాదకరమైన చెట్లు నాటించారని, పిల్లలు ఆడుకునే విధంగా..పెద్దలు చుట్టూ వాకింగ్ చేసే విధంగా..సాయంకాలం గ్రామస్తులందరూ ప్రశాంతంగా కూర్చునే విధంగా వారు నిర్మించినట్లు చెప్పారు. శనివారం జాతీయ వాటర్ షెడ్ సదస్సు మహోత్సవంలో భాగంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌తో కలిసి ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అభివృద్ధి చేసిన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లె ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజల వ్యాయామానికి అవసరమైన నూతన ఏర్పాట్లతో పరికరాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని కలిగించే విధంగా చెరువును అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాదిగ భవన్ తాత్కాలిక కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు

వైద్యం : అమరావతి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'మాదిగ భవన్ తాత్కాలిక' కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్‌తో కలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ జాతి యువకులు ఉన్నత పదవులు, ఉద్యోగాలు అధిరోహించడానికి ఒక వేదిక కావాలనే ఉద్దేశ్యంతో ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మాదిగ భవన్ మనందరి భవన్ అని, సమాజంలోని అన్ని పేదవర్గాల అభివృద్ధి నిమిత్తం మాదిగ భవన్ నిర్మాణం చేయటం జరిగిందన్నారు. మాదిగ జాతి అభ్యున్నతకు ఇదొక తొలి అడుగు అని, మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి, అభివృద్ధికి మార్గదర్శకంగా ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. మాదిగ జాతి అన్ని రంగాలలో అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం తరపున ఒక స్థలాన్ని కేటాయించి మాదిగ అభివృద్ధి భవన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ భవన్ సంక్షేమ అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పారి షాలీంరాజు, ఉపాధ్యక్షులు నలుకుర్తి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సొపాటి రత్నం, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంగుంట్ల ఆదాం, కోశాధికారి బుల్లా కిషోర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారుల ఆక్రమణలో బాపట్ల బస్టాండ్

విశాలాంధ్ర-పొన్నూరు

పట్టణంలోని బాపట్ల బస్ స్టాండ్ ఎదురు ఓ ప్రైవేటు టెలిఫోన్ వ్యాపార సంస్థ టెంటు, బల్లలు, కుర్చీలు వేసి బస్‌స్టాప్‌ను ఆక్రమించింది. శనివారం జరిగిన ఈ ఆక్రమణకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులు బస్‌స్టాప్‌లో కూర్చునేందుకు వీలు లేకుండా ఆక్రమించి దర్జాగా వారి వ్యాపారము వారు చేసుకుంటున్నారు. వారంలో రెండు రోజులు బస్టాండ్ ఎదురు ఇలా ఆక్రమణలు చేసి వ్యాపారం నిర్వహిస్తున్న సంబంధిత శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటంతో ప్రయాణికులతో పాటు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క టెంట్, మరోపక్క ద్విచక్ర వాహనాలతో ఈ ప్రాంతం కదలటానికి వీలు లేకుండా ఉంది. దీంతో ప్రయాణికులు ఎండలోనే గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించింది. మున్సిపల్ అధికారులు, ఆర్టీసీ అధికారులు ప్రైవేటు వ్యాపారుల ఆక్రమణలను తొలగించి ప్రజా రవాణా సాఫీగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన ఎన్జీ రంగా

విశాలాంధ్ర-గుంటూరు

వైద్యం : ఎలాంటి ప్రతిఫలం, పదవులు ఆశించకుండా తన జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన నాయకుడు ఎన్జీ రంగా అని, భారత రాజకీయ క్షేత్రంలో రైతు రంగాగా దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. కార్యాలయంలో రైతు నేత ఎన్.జి రంగా జయంతి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, చేనేత కార్మికుల కోసం జీవితాంతం కృషి చేసిన స్వతంత్ర భావాలు గల ఎన్.జి రంగా జాతీయోద్యమ అగ్రశ్రేణి నాయకుడన్నారు. 1930 నుండి 1990 వరకు ఆరు దశాబ్దాలకు పైగా పార్లమెంట్ సభ్యునిగా పని చేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు గాంచారని, తాను నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీపడని వ్యక్తిత్వం రంగాదని అన్నారు. రైతు నాయకుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల సుదీర్ఘ పార్లమెంటరీ చరిత్ర కలిగి యావత్తు ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా గిన్నిస్ బుక్‌లో ఎక్కినా ఏనాడు ఎన్.జి రంగా పదవులు ఆశించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు, విశ్లేషకులు ఇ.చంద్రయ్య, పిఎస్ మూర్తి తదితరులు పాల్గొని రంగాకు నివాళులర్పించారు.

సృజనాత్మకత పెంచేలా విద్యా బోధన సాగాలి

విశాలాంధ్ర - పిడుగురాళ్ల :

విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేలా విద్యా బోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారులు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో రెండు రోజులపాటు టీచ్ టూల్‌పై శిక్షణ తరగతులు జరిగాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధనలో మెలుకువలు పాటిస్తూ వారి విద్యాభ్యాసంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేందుకు అవలంబించాల్సిన విషయాలపై ఆర్పీలు బి మాధవి, కె మునిరాజులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసరెడ్డి(1), వై శ్రీనివాసరావు(2) తోపాటు ఆర్పీలు, పలు గ్రామాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాపుల ఏర్పాటు కోరుతూ ఏసీ రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్లు ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర- వెల్దుర్తి :

పట్టణంలో షాపులు నిర్మాణం కోసం ఏసీ రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్లు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏసి రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్ల ఉమ్మడి గుంటూరు జిల్లాల యూనియన్ గౌరవ సలహాదారులు దాసరి రమేష్ మాట్లాడుతూ పట్టణంలో ఏసీ రిఫ్రిజిరేషన్ల టెక్నీషియన్లు సుమారు 80 మంది దాకా ఈ వృత్తిపై కొనసాగుతున్నారన్నారు. ఏసీ రిఫ్రిజిరేషన్ల టెక్నీషియన్లకు ఏడాదికి మూడు నుండి నాలుగు నెలలు మాత్రమే పని ఉంటుందని, ఆ తర్వాత పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ త్వరలో షాపుల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించేలా మున్సిపల్ కమిషనర్ వేణు బాబుకు ఆదేశించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు శాలివాహన ప్రజాపతుల కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-దాచేపల్లి: శాలివాహన (కుమ్మర) ప్రజాపతుల కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి సంఘీయులు విధిగా హాజరుకావాలని కోరారు.

CHANGE OF NAME

I, SHAIK MABU JANI (Old Name) D/o. SHAIK KARIMULLA, Resident of Door No. 28-216/1, Bose Road, Chilakaluripet, Palnadu District, have changed my name as SHAIK MABU JAN (New Name).Hereafter, I shall be known as SHAIK MABU JAN (New Name) for all purposes.

CHANGE OF SURNAME

I, NAGA VENKATA SUVARNA NEMANI (Old Name), W/o. NEMANI SRIDHAR, Resident of Flat No: 102, Anjany Murthy Arcade Apartment, Palakaluru Road, City Sweets Bakery Back Side, Ratnagiri Colony 3rd Line, Guntur, Guntur District - 522006, Andhra Pradesh. I have changed my surname as KANCHARLA NAGA VENKATA SUVARNA (New Name) W/o. NEMANI SRIDHAR. Hereafter my surname is known as KANCHARLA NAGA VENKATA SUVARNA (New Name) W/o. NEMANI SRIDHAR.

CHANGE OF NAME

I, ADIRALA SANTHAMMA (Old Name), W/o. RETURI MAHESH, Resident of Flat No: 114, Ramamurthy Enclave, 7th Line, Brundavan Gardens, Beside ICICI Bank Line, Guntur, Guntur District - 522006, Andhra Pradesh. I have changed my name as ADIRALA SANTHI (New Name) W/o. RETURI MAHESH. Hereafter my name is known as ADIRALA SANTHI (New Name) W/o. RETURI MAHESH.

సినీ పాటల పోటీల్లో శివబాబుకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర-దుర్గి: ధర్మవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ హరిహర బాలనాగేంద్రస్వామి 35వ వార్షిక మహోత్సవాల సందర్భంగా సినిమా పాటలు, పద్యాలు, ఏక పాత్రాభినయ పోటీలు కోలాహలంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన ఈ పోటీలలో ముందుగా సినిమా పాటల పోటీ జరగ్గా యంఎస్ శివబాబు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. జి.రాజ్ కుమార్ రెండవ బహుమతి, కె.సుగుణ మూడవ బహుమతిని సాధించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ కమలా సనరావు వ్యవహరించారు. పౌరాణిక పద్యగాన పోటీలలో కె.నాగేశ్వరరావు(చీరాల) ప్రథమ బహుమతిని గెలుచుకొనగా నీలం వెంకటేశ్వర్లు(పెదపాలెం)రెండవ బహుమతిని ఉప్పలపాటి అంజిరెడ్డి మూడవ బహుమతిని దక్కించుకున్నారు. ఏక పాత్రాభినయ పోటీలలో యం.అర్జునరావు (హైదరాబాద్) ప్రథమ బహుమతిని హమీద్(ఏలూరు) ద్వితీయ బహుమతిని (బలిజేపల్లి)మూడవ బహుమతిని సాధించారు.ఈ రెండు పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అచ్చుల సుబ్బారావు, డాక్టర్ అబ్దుల్ రజాక్ వ్యవహరించారు. నిర్వహణ కమిటీ సభ్యులు కొత్త వెంకటేశ్వర్లు, కూరాకుల రామారావు, చిమటా శ్రీనివాసరావు, కర్నూరపు హనుమంతరావు పర్యవేక్షించారు.

పరిమితికి మించి ప్రయాణికుల్ని ఎక్కిస్తే కఠిన చర్యలు: సీఐ

విశాలాంధ్ర-విజయపురిసౌత్:

ఆటోల్లో ప్రయాణికులను పరిధికి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా హెచ్చరించారు. శనివారం మాచర్ల మండలంలోని కొత్తపల్లి జంక్షన్ వద్ద ప్రయాణికులకు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అధిక లోడు తో వెళ్తున్న 8 ఆటోలపై అపరాధ రుసుము విధించారు.అనంతరం సిఐ నఫీజ్ బాషా మాట్లాడుతూ ఆటో డ్రైవర్ లు తప్పనిసరిగా లైసెన్స్ లు కలిగి ఉండాలన్నారు.ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఆదివారం 09 నవంబరు । 2025

శ్రీ అమరేశ్వర స్వామిని దర్శించుకున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ సత్తి సుబ్బ రెడ్డి

విశాలాంధ్ర-అమరావతి: శ్రీ స్వామివారి దేవస్థానంలో శనివారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ సత్తి సుబ్బరెడ్డి శ్రీ అమరేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమరేశ్వర స్వామి వారికి ప్రత్యేక ప్రదోష పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులతో వేద ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశామని కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'గ్రీవెన్స్' కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరైన సందర్భంగా ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా పరిశీలించారు. వీవీఐపీ, వీఐపీ మార్గాల్లో భద్రతా చర్యలను పరిశీలించిన ఎస్పీ బీడీ టీమ్ వారు నిర్వహించిన తనిఖీలను ఆరా తీశారు. భద్రతా ప్రమాణాలను కఠినంగా పాటించి, పటిష్టంగా వ్యవహరించాలని సూచించారు. భద్రతా విభాగ సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీలను పరిశీలించారు. కార్యక్రమం ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణ స్థానాల్లోనే ఉండి, నిరంతర అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమన్వయంతో వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఏటీవీ రవికుమార్(ఎల్ అండ్ ఓ) ఏ.హనుమంతు(ఏఆర్), నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణ, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మన మిత్ర' సేవలను వినియోగించుకోండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రజల వద్దకే ప్రభుత్వం.. ప్రజల చేతిలో ప్రభుత్వం అనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర పేరుతో తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరూ తమ మొబైల్ ఫోన్‌లో వినియోగించుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. అందుకు అనుగుణంగా సచివాలయ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వేగవంతంగా పౌర సేవలను అందిస్తోందని, మన మిత్ర యాప్ ద్వారా 'ప్రజల చేతిలో ప్రభుత్వం' అనే భావనను సాకారం చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ 'బటన్ నొక్కితే పౌర సేవలు అందిస్తాను' అని ఇచ్చిన హామీని అమలు చేస్తూ వాట్సాప్ ద్వారా పౌర సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు ప్రజల్లో మన మిత్ర సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.

అనాధ పిల్లలకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-పొన్నూరు : విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వ ర్యంలో నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా మండల పరిధిలోని బ్రాహ్మణ కోడూరు చైల్డ్ హోమ్‌లో అనాధ పిల్లలకు శనివారం పలు పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, క్విజ్, రన్నింగ్ రేస్, లెమన్ స్పూన్, డ్రాయింగ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చైల్డ్ హోమ్ అనాధలకు పండ్లు, స్వీట్లు, పుస్తకాలు తదితరాలు పంపిణీ చేశారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ వింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు పండ్లతో అలంకరణ

విశాలాంధ్ర - దాచేపల్లి : కార్తీకమాసంలో భాగంగా పెనుగంచిప్రోలు లోని శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారు, గోపయ్య స్వామికి ఆదివారం నాడు అన్ని రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి మాలధారణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున భక్తులు, మహిళలు హాజరై అమ్మవారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సమితి మండల శాఖ అధ్యక్షుడు కొత్త రామారావు, జంగిలి అప్పారావు తదితరులు ఉన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఢిల్లీలో మహా ధర్నా

విశాలాంధ్ర-మంగళగిరి : భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నేతృత్వంలో వివిధ సామాజిక, ప్రజాస్వామిక సంస్థలు, నాయకులు ఢిల్లీలో మహా ధర్నా నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహా ధర్నాకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ మహా ధర్నా నవంబర్ 20న గురువారం ఉదయం 10 గంటలకు జంతర్ మంతర్ వద్ద జరగనుంది. ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ సహా అనేక దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశంలో రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి అని, రాజ్యాంగ విలువలను రక్షించడంలో ప్రతి పౌరుడికి బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనకు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా పూర్తిగా శాంతియుతంగా జరుగు తుందని, దేశ రాజ్యాంగ వ్యవస్థ, న్యాయ పరిపాలన పట్ల గౌరవం ఉంచే విధంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి: నియోజకవర్గ పరిధిలోని 28 మంది లబ్ధిదారులకు రూ. 15,09,789 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి నాదెండ్ల మనోహర్ పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇప్పటి వరకు 304 మందికి రూ.3కోట్ల సాయం అందజేశామన్నారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మోసపోయం.. న్యాయం చేయండి : తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డుకి చెందిన రాజ్యలక్ష్మి అనే మహిళ జ్యోతిష్యం పేరుతో తమను మోసం చేసిందని పట్టణానికి చెందిన కృష్ణచైతన్య, మల్లేశ్వరి దంపతులు మంత్రి నాదెండ్ల మనోహర్ వద్ద వాపోయారు. తను ఇచ్చే రాళ్లు తీసుకోకపోతే ప్రాణగండం ఉందని భయపెట్టి భారీగా నగదు వసూలు చేసి మోసం చేసిందని, తమకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ధైర్యంగా ఉండాలని, ఎంక్వయిరీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారినని బెదిరిస్తున్న వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర- చిలకలూరిపేట: ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారినని చెప్పి వివిధ వ్యాపారస్తులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పుడుతున్న వ్యక్తిని పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. విలేకర్ల సమావేశంలో అర్బన్ సీఐ పి.రమేష్ తెలిపిన వివరాలు.. గుంటూరు నగరం ఆర్టీసీ కాలనీకి చెందిన చదలవాడ తిరుమల రెడ్డి ఆన్‌లైన్‌లో వివిధ వ్యాపారాలకు చెందిన వ్యక్తుల వివరాలు సేకరిస్తాడు. వారికి ఫోన్ చేసి తాను ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారినని, మీ మీద ఇన్‌కామ్‌టాక్స్ అధికారులు రైడ్ చేయనున్నారని, అకౌంట్ పుస్తకాలు తనిఖీ చేస్తారని వివరి స్తాడు. అన్ని జాగ్రత్తగా పెట్టుకోవాలని, రైడ్‌కు వచ్చిన సమయంలో ఫైల్ సరిగా లేకపోతే సెటిల్‌మెంట్ చేసుకోవాల్సి వస్తుందని, మేము అడిగిన మొత్తం చెల్లించని పక్షంలో ఆస్తులు సీజ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తాడు. ఇతనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఒక మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై తూర్పు గోదావరి జిల్లా తుని, పట్టణ పోలీస్‌స్టేషన్, తెలంగాణాలోని ఖమ్మంలో రెండు కేసులు, విశాఖ పట్నం ఒకటవ టౌన్ పీఎస్‌లో, ఎన్‌టీఆర్ జిల్లా సూర్యాపేట, విజయనగరం జిల్లా రాజాం పోలీసుస్టేషన్, పాత గుంటూరుతో పాటు చిలకలూరిపేటలో కలిపి ఎనిమిది కేసులు ఉన్నట్లు తెలిపారు. పట్టణ ఎస్ఐలు డి చెన్నకేశవులు, పి.హజరతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా పెదకాకాని మండలం శంకర ఐ హాస్పిటల్ కార్యక్రమానికి ఆదివారం ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం తనిఖీ చేశారు. అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లకు దరఖాస్తులు చేసుకోండి : ఏఈ

విశాలాంధ్ర-మాచర్ల : స్థలం కలిగి అర్హులైన ప్రతి ఒక్కరూ పక్కా ఇళ్లకు అర్జీ దాఖలు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాచర్ల రూరల్ మండల పరిధిలోని అర్హత కలిగిన చెంచులు పీఎం జన్ మన్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జుగ స్కీమ్ ద్వారా నాగులవరం పంచాయతీ పరిధిలోని బీకె పాలెం, బీకె పాలెం చెంచు కాలనీ, సుబ్బారెడ్డి పాలెం, బోదనంపాడు, బోదనంపాడు చెంచు కాలనీ ఈ గ్రామాల క్రింద ఇల్లు లేని యరుకుల, యానాది, సుగాలీలు ఇల్లు అప్లై చేసుకోవచ్చన్నారు. పిఎంఏవై 2.0 క్రింద మాచర్ల మండలంలోని లోని ఇల్లు లేని నిరుపేదలైన అన్ని కులాల వారు ఇంటి కోసం అర్జీ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం ఏఈ కార్యాలయాన్ని సంప్రదించాలని, అర్జీలపై త్వరలో అన్ని గ్రామాలలో సర్వే నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జెట్టిపాలెం విద్యార్థులు

విశాలాంధ్ర-రెంటచింతల: ఒకేషనల్ ఎడ్యూకేషన్ ఆటోమోబైల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కిల్ డెవలప్మెంట్ పోటీలలో జెట్టిపాలెం ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులు మూడవ బహుమతిని దక్కించుకుని రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ కె. పాపయ్య శనివారం తెలిపారు. దూళిపాళ్ల వద్ద నున్న లయోల టెక్నాలజీ ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూట్లో ఈ నెల 7 వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన 9, 10 తరగతి విద్యార్థులు తయారు చేసిన రోడ్డు ట్రాఫిక్ సిగ్నల్ ప్రాజెక్టు, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్స్ ప్రాజెక్కు మూడవ బహుమతి లభించిందన్నారు. జిల్లా విద్యాశాఖాధి కారి ఎల్ చంద్రలేఖ చేతుల మీదుగా స్కూల్ ట్రైనీ టీచర్స్ వి. స్వప్న, విద్యార్థులు బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, స్కూల్ ట్రైనీ టీచర్స్ వి. స్వప్న, టి.వెంకటరామయ్యలను ప్రిన్సిపాల్ పాపయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

డాగ్ షెడ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం పొన్నూరు రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న కేంద్ర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పొన్నూరు రోడ్‌లో నిర్మాణంలో ఉన్న డాగ్ షెడ్, అరండల్ పేట, అశోక్ నగర్, విద్యా నగర్, శారదా కాలనీ, శ్రీనగర్, రాజీవ్ గాంధి నగర్, యాదవుల బజార్, తదితర ప్రాంతాల్లో శనివారం కమిషనర్ పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత పొన్నూరు రోడ్‌లో నిర్మాణంలో ఉన్న వీధి కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రం పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్‌కి అనుమతులు మంజూరు చేసినందున, సీసీ ఫ్లోర్‌కి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు తీసుకోవాలన్నారు. ఎస్ఈ ప్రత్యేక శ్రద్ధతో కేంద్ర నిర్మాణ పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పర్యటనలో ఎస్ఈ(ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, డీఈఈలు రమేష్, సతీష్ కుమార్, కళ్యాణరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్ ఆర్టోరియా 2025

-ఘనంగా నిర్వహించిన కేఎల్‌హెచ్ జీబీఎస్

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ తమ బి.ఎస్.సి. యానిమేషన్ అండ్ గేమింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందించిన రెండు రోజుల ఆర్ట్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్ " ఆర్టోరియా 2025 ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పరిశ్రమ నిపుణులైన గ్రీన్ గోల్డ్ యానిమేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వినయ్ తివారి (లీడ్ %-% ఎన్విరాన్‌మెంట్ అసెట్స్) తీర్థదీప్ ఘోష్ (క్రియేటివ్ డైరెక్టర్) హాజరయ్యారు. వారు విద్యార్థులతో మమేకమై, వారి సృజనాత్మకతను ప్రశంసించడంతో పాటు విలువైన సూచనలు అందించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, కళ టెక్నాలజీ సమన్వయానికి ఉన్న ప్రాధాన్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ ఇంజి. కోనేరు లక్ష్మణ్ హవీష్ మాట్లాడుతూ, "ఇలాంటి వేదికలు విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తాయన్నారు. కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయన్నారు. మా క్యాంపస్‌లలో నేర్చుకోవడం కేవలం తరగతి గదుల వరకు పరిమితం కాదు, టెక్నాలజీని సృజనాత్మకతకు కాన్వాస్‌గా మార్చే ప్రదేశాల వరకూ విస్తరిస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు ఫేస్ ఆర్ట్ కియోస్కులు, క్రాఫ్ట్ ఇన్‌స్టాలేషన్లు, ఏఐ ఇన్నోవేషన్ కార్నర్ వంటి ఇమర్సివ్ అనుభవ ప్రాంతాలను రూపొందించారన్నారు. వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డీన్ డాక్టర్ ఆనంద్ బేతాపూడి మరియు అధ్యాపక బృందం సమన్వయంతో నిర్వహించారు. కేఎల్‌హెచ్ జీబీఎస్ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, సంవత్సరమంతా ప్రదర్శనలు, ఇన్నోవేషన్ ఫోరమ్‌లు, నిపుణుల చర్చలు మరియు బహుశాఖ ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు జ్ఞానం, సృజనాత్మకత, వాస్తవ అనుభవాల మధ్య అనుసంధానం కలిగించే సమగ్ర విద్యా వాతావరణాన్ని అనుభవించేందుకు ఇది దోహదపడుతోందన్నారు.

కృష్ణా జిల్లా వాలీబాల్ జట్టులో పెదముత్తేవి హైస్కూల్ విద్యార్థిని

విశాలాంధ్ర -కూచిపూడి : మొవ్వమండలం పెదముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి విద్యా విహార్ సంస్కృత ఓరియంటల్ హై స్కూల్ లో 8 వ తరగతి చదువుతున్న ఏ. గోపిక గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం లో జరిగిన అండర్-14 బాలికల వాలీబాల్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరచి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం కె.మాధవి శనివారం తెలిపారు. జిల్లా జట్టుకుఎంపికైన క్రీడాకారిణి గోపికనుపాఠశాల కరెస్పాండెంట్, శ్రీకృష్ణాశ్రమం లోనిముముక్షుజన మహాపీఠాధిపతిముత్తేవిగౌర కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఆమెకు పి.ఈ.టీ.ఎం.వర్మ ,పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తమ అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సన్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర -కూచిపూడి : ఈనెల 22వ తారీఖున కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కృష్ణా జిల్లాలోని మొవ్వ మండలం కోసూరుసనసన్.ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.టి. జోసఫ్, పి ఈ టి రాజశేఖర్ శనివారం తెలిపారు. గూడూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల బాల, బాలికల సెలక్షన్స్ లో అండర్ 17 విభాగంలో కృష్ణాజిల్లా జట్టులో వి రాజశేఖర్ రెడ్డి, సిహెచ్ మానస ఎంపికైనట్లు వివరించారు. ఈ క్రీడాకారులను పాఠశాల చైర్మన్ ఎం.డి. వి ఎస్. ఆర్. పున్నంరాజుఅభినందించారు.

జాతీయ అర్బన్ కాన్‌క్లేవ్ 2025లో జగ్గయ్యపేట మునిసిపల్ ఛైర్మన్

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : ఈ నెల 8 శనివారం ఢిల్లీ యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైన నేషనల్ అర్బన్ కాన్‌క్లేవ్ 2025 తొలి రోజు కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, అధికారులు మరియు అర్బన్ పాలసీ నిపుణులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ,ఏ పి సీడీఎంఏ అధికారి సంపత్ కుమార్ పాల్గొని పట్టణాభివృద్ధి, స్మార్ట్ సిటీ కాన్సెప్ట్, మున్సిపల్ పరిపాలనలో నూతన పద్ధతులపై జరిగిన చర్చల్లో భాగమయ్యారు.ఈ కార్యక్రమానికి కేంద్ర గృహ మరియు పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరై కాన్‌క్లేవ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాలు భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి నగరం పరిపాలనలో పారదర్శకత, సాంకేతికత మరియు ప్రజా భాగస్వామ్యం పెంపొందించుకోవాలని సూచించారు. సౌరశక్తి వినియోగం, వ్యర్థ నిర్వహణ, మరియు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పట్టణ అభివృద్ధి వంటి అంశాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రధాన వక్తలు సుస్థిర పట్టణాల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మొదటి రోజు కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, అంతర్జాతీయ పట్టణాభివృద్ధి నిపుణులు పాల్గొని అనేక అంశాలపై ప్రసంగించారు. కేంద్ర హౌసింగ్ & అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొని అంతర్జాతీయ పట్టణ పాలసీ నిపుణులు "స్మార్ట్ సిటీస్ మరియు రిజిలియెంట్ అర్బన్ ప్లానింగ్" పై వివరించారు. డిజిటల్ గవర్నెన్స్ ఇన్ అర్బన్ ఇండియా అనే అంశంపై జరిగిన సెషన్‌లో పౌర సేవల డిజిటలైజేషన్, డేటా ఆధారిత మున్సిపల్ పరిపాలనపై చర్చలు జరిగాయని మునిసిపల్ ఛైర్మెన్ ఢిల్లీ నుండి ఒక పత్రికా ప్రకటన ద్వారా స్థానిక విలేకర్లకు తెలిపారు.ఇలాంటి జాతీయ స్థాయి సమావేశాలు మున్సిపల్ స్థాయి అధికారులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి రాష్ట్ర స్థాయిలో కూడా నిర్వహిస్తే పట్టణ అభివృద్ధికి మరింత దిశానిర్దేశం లభిస్తుంది" అని అన్నారు. ఆయన ఈ కార్యక్రమం ద్వారా జగ్గయ్యపేట మున్సిపాలిటీలో అనుసరించదగిన పలు సరికొత్త ఆలోచనలను తెలుసుకున్నట్లు తెలిపారు. ఆయనకు ఈ అవకాశం ఇచ్చిన జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)కి, కౌన్సిలర్లకు మరియు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సుగాలి ప్రీతి అంశాన్ని రాజకీయంగా వాడుకుని అధికారంలోకి వచ్చారు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సుగాలి ప్రీతి అంశాన్ని పవన్ రాజకీయం గా వాడుకుని అధికారంలోకి వచ్చాక బాధితులకు న్యాయం చేయకుండా సమస్య అలాగే ఉంచి దోషులకు అండగా ఉంటున్నారని హైకోర్టు న్యాయవాది, జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ అరోపించారు.శనివారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు అంటే ఓటుకు మాత్రమే పనికొస్తారా వారికి అన్యాయం జరిగినప్పుడు న్యాయం చేయటానికి ముందురారా అని ప్రశ్నించారు. లోకేష్ రెడ్ బుక్‌లో సుగాలి ప్రీతి హంతకుల పేర్లు ఉన్నాయా అని అడిగారు.పవన్‌కళ్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుర్తున్న పేరు అధికారం వచ్చాక ఎందుకు గుర్తు రావడం లేదని సూటిగా ప్రశ్నించారు.అధికారంలోకి వచ్చి 16నెలలు అయినా న్యాయం జరగలేదని సుగాలి ప్రీతి తల్లి అడిగితే ఎదురుదాడి చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు.2017లో కేసు జరిగింది ఇన్వెస్టకేషన్ జరిగింది 2018 లో జగన్ హయాంలో ఈ ఘటన జరగలేదు.తెలుగుదేశం హయాంలోనే జరిగిందన్నారు.బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి జగన్ ప్రయత్నం చేసి కేసును సీబీఐ కి అప్పగించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని కుటుంబాలకు ఉద్యోగాలు వొచ్చాయి ఎన్ని ఉద్యోగాలు షెడ్యూల్ క్యాస్ట్ నుండి ఓపెన్ కేటగిరికి మార్చారు అని ప్రశ్నించారు. సీబీఐ కి ఇచ్చిన తర్వాత ఇప్పటివరకు ఎందుకు తీసుకోలేదు.వంశీ, వెంకట కృష్ణ, సాంబతో రోజు మాట్లాడేవాడిని.17 కుటుంబాలకు కరెంట్ ఇస్తే ఓజి సినిమా కంటే ఎలివేషన్ పవన్‌కి ఛానల్స్ ఇచ్చాయి అన్నారు. సుగాలి ప్రీతి, మువ్వల నగేష్ కేసు మీకు పట్టదా, బాధితుల తరపున ఎందుకు మాట్లాడడం లేదు అన్నారు.మువ్వల నగేష్ మరణానికి కారణం ఐయినా వాళ్ళను ఎందుకు జనసేన లో చేర్చుకున్నారు.గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, లైట్స్ లేవో అక్కడ ఆ సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం 24వేల కోట్లు ఖర్చుతో పథకం ప్రవేశ పెట్టింది.డీఎస్సీ లో 3900 గిరిజన ప్రాంత పోస్టులు నాన్ ట్రైబుల్ పోస్ట్ లుగా మార్చారు.30 సంవత్సరాలు డిఎస్సీ పోస్టులు భర్తీ చేయకుండా కాంట్రాక్టు పద్దతిలో వర్క్ చేయించుకున్నారు.గిరిజన భూములు ప్రవేట్, కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారన్నారు.లక్ష 50వేల ఎకరాలు నాన్ ట్రైబ్ ఆధీనంలో ఉన్నాయి.ట్రైబుల్ ఏరియాలో సమస్యలు అసలు మారలేదన్నారు.సుగాలి ప్రీతి తల్లి పార్వతి, మువ్వల నగేష్ కుటుంబాలతో కలిసి ఈనెల 26న అంబెడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తాం అన్నారు.గిరిజన ప్రాంతాల్లో 3 పూటలు తిండి కూడా లేని పిల్లలు ఉన్నారు..దానికి కారణం పాలకులే అని అరోపించారు.

ఢిల్లీలో మహాధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి యావత్ భారతదేశ దళిత వ్యవస్థపై జరిగిన దాడి దీనికి కారణమన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 ఛలో ఢిల్లీ పేరుతో జంతర్ మంతర్ వద్ద మహాధర్నా చేపడుతున్నామని దీనిలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపు నిచ్చారు. శనివారం గాంధీనగర్లఓని ప్రెస్‌క్లబ్‌లో ఛలో ఢిల్లీ పోస్టర్ అవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు సుప్రీం కోర్టులో చెప్పు దాడి చేసిన రాకేష్ కిషోర్ పై ఇప్పటివరకూ టివరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉసురుపాటి మండిపడ్డారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని కుల వ్యవస్థను భారతదేశంలో సృష్టించి ఈ కుల వ్యవస్థ ద్వారా మిగిలిన జాతులన్నిటిపై తమ కుట్ర పూరితమన భయాన్ని రకరకాల సంప్రదాయాల పేరిట కట్టు బానిసలుగా చేసుకుని తమ అధిపత్యాన్ని కొనసాగిస్తున్న మనువాద భావజాల ఆధిపత్యానిరి వ్యతిరేకంగా ఒకే గొంతుకను నినదిద్దాం అని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ,దళిత టిడిపి నాయకులు పరిశోగు రాజేష్,రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ,కమరాల శ్రీను మాదిగ,బద్దేటి రాజు,మాతంగి సంజయ్,బిరుదల లలిత మాదిగ,కారుమూరి బేనార్డ్,వీరబాబు,తదితరులు ఆల్గొన్నారు.

ఆంధ్ర హాస్పటిల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుక దారిటీ సౌజన్యంతో ఉచిత పిల్లల గుండె సర్జరీలు

విశాలాంధ్ర- విజయవాడ ఎడ్యుకేషన్ : ఆంధ్ర హాస్పిటల్స్ లో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుక చారిటి సౌజన్యంతో 36వ ఉచిత పిల్లల గుండె సర్జరీలు క్యాంపు నవంబర్ 02 నుంచి 08 వరకు నిర్వహించారు. గత పది సంవత్సరాల నుండి ఇప్పటివరకు ముప్పైఆరు సార్లు ఆంధ్ర హాస్పిటల్స్ కు వచ్చి పిల్లలకు గుండె సర్జరీలు విజయవంతంగా చేసారన్నారు. మున్ముందు కూడా ఈ రకమైన గుండె ఆపరేషనులు ప్రతి రెండు, మూడు నెలలకొకసారి ఆంధ్ర హాస్పిటల్స్ కు వచ్చి చేయనున్నారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో అత్యధిక పిల్లల కార్డియాక్ సర్జరీలు నెలకు 50 నుంచి 60 ఆపరేషన్లు చొప్పున సంవత్సరానికి 600 పిల్లల గుండె ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 5000 ఆపరేషన్లు పైన మరియు ఇంటర్వెన్షన్స్ విజయవంతంగా చేశామన్నారు. నవ్యంధ్రప్రదేశ్ లో మొట్టమొదటి సారిగా ఇన్నిపిల్లల గుండె ఆపరేషన్లు విజయవంతంగా చేయటానికి ఆంధ్ర హాస్పిటల్స్ డా ఎ.ఎం విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ టీం, నవజాత శిశువులు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ టీమ్స్ కలిసి చేయటం వలన సాధ్యపడిందని డాక్టర్ పి.ఏ.రామారావు చీఫ్ అఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ డైరెక్టర్ తెలియచేసారు. ఆంధ్ర హాస్పిటల్స్ లో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్కార్డియాక్ టీమ్ %ంaడ% కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ టీం సహకారంతో ప్రతి రోజు గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియచేసారు. పిల్లల గుండె జబ్బులు వున్న వారు రెండు తెలుగు రాష్ట్రాల నుండి మన హాస్పిటల్ కు వస్తున్నారని చెప్పారు. ఈ ఆపరేషన్లు విజయవంతంగా

నిర్వహించినందుకు ఆంధ్ర హాస్పటిల్స్ మరియు హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకె డాక్టర్లు మరియు నర్సులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు.ఈ క్యాంపు ని ఆంధ్ర మధర్ అండ్ చైల్డ్ ఫౌండేషన్, మహేష్ బాబు ఫౌండేషన్ మరియు ఎన్ టి ఆర్ వైద్య సేవ సహకారంతో నిర్వహించారు. డా॥ఎం విక్రమ్, పిల్లల కార్డియాలజిస్ట్, డా ఎం ఛిస్టీ, పిల్లల కార్డియాలజిస్ట్, డా ఎం నాగేశ్వర రావు, కార్డియాక్ సర్జన్, డా॥ఎం రమేష్, కార్డియాక్ ఎన్ స్టిటిస్ట్, డా॥ఎం రఘు రామ్, కార్డియాలజిస్ట్, మరియు డా॥ఎం తిరుపతి రావు, కార్డియాలజిస్ట్, ఈ విలేఖరుల సమావేశం లో పాల్గొన్నారు.

విజయవాడ మలబార్‌లో షో ది వే

బ్రైడల్ జ్యువెలరీ షో

- 8 నవంబర్ నుండి 16 వరకు.

విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నమరియు అతిపెద్ద బంగారు నగల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ %ంaడ% డైమండ్స్, తమ" బ్రైడల్ జ్యువెలరీ షో' ని మలబార్ గోల్డ్ %ంaడ% డైమండ్స్, విజయవాడ షోరూంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా షోరూం మార్కెటింగ్ మోనేజర్ ఖాసిం మాట్లాడుతూ ఈ బ్రైడల్ జ్యువెలరీ షో 08 నవంబర్ నుండి 16 నవంబర్, 2025 వరకు కొనసాగుతుంది. ఈ ప్రచారానికి ఎంపిక చేసిన ఇతివృత్తం (షో ది వే). ఈ ఇతివృత్తం ద్వారా భిన్న ప్రాంతాలు, విభిన్న సంస్కృతులు మరియు సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నవ వధువుల కోసం కళాత్మకంగా రూపొందించిన ఆభరణాలు ప్రదర్శించబడతాయని తెలిపారు. భారతీయ వారసత్వ ఆభరణాలు మరియు హస్తకళారూపాల ఆభరణాల బ్రాండ్ ' డివైన్', వజ్రాభరణాల బ్రాండ్' మైన్', అన్ కట్ వజ్రాభరణాల బ్రాండ్' ఎరా' మొదలైనవి కూడా ఈ ప్రచారంలో చోటుచేసుకున్నాయన్నారు. భాగంగా భారత దేశ వ్యాప్తంగా మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూములలో ఒకే ఉత్తమమైన ధర వినియోగదారులకి అందించడం జరుగుతుందన్నారు. ఆభరణాల రాళ్ల విలువతోకూడిన పారదర్శకధరల పట్టి,

ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారానికి 100 శాతం విలువ మరియువజ్రాభరణాల పై 100% విలువ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. జీవితకాల నిర్వహణ మరియుబాధ్యతాయుతమైన మూలాల నుండిబంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుందని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ %ంaడ%డైమండ్స్ మార్కెటింగ్ హెడ్ అర్జున్,దేదివ్య,మౌనికా సాయి,జన్ను,మౌని తేజ మలబార్ గోల్డ్ %ంaడ%డైమండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లా నెట్‌బాల్, హ్యాండ్ బాల్

- ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండర్-17 బాలురు మరియు బాలికల అంతర్ జిల్లా నెట్‌బాల్ మరియు అండర్-17 బాలికల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్లు శనివారం విజయవాడ లోని పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఎంతో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లను క్రీడా జ్యోతిని వెలిగించి, పోటీలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్‌లోని పూర్వపు 13 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులను ముఖ్య అతిథికి పరిచయం చేశారు.సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తూ, టోర్నమెంట్లలో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ మరియు జట్టుకృషి స్ఫూర్తిని నిలబెట్టాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల విద్యార్థులలో అట్టడుగు స్థాయి క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి ఇటువంటి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లను నిర్వహించినందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌ను ఆయన అభినందించారు. క్రీడలు శారీరక, మానసిక బలాన్ని పెంపొందించుకుంటాయని నొక్కి చెబుతూ, విద్యతో పాటు కనీసం ఒక క్రీడలోనైనా పాల్గొనాలని ఆయన విద్యార్థులకు సూచించారు. భారత మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేత శ్రీ చరణి మరియు చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఉదాహరణలను ఉటంకిస్తూ, ఆంధ్రప్రదేశ్ తమ విజయాల ద్వారా జాతీయ గౌరవాన్ని తెచ్చిపెట్టిన అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసిందని ఆయన అన్నారు. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతను ఎమ్మెల్యే పునరుద్ఘాటిం

చారు. ఉన్నత స్థాయిలో పతకాలు సాధించడం వల్ల అథ్లెట్లకు మాత్రమే కాకుండా రాష్ట్రానికి, దేశానికి కూడా గుర్తింపు వస్తుందని ఆయన నొక్కి చెప్పారు. అదనంగా, ఇటీవలి మెగా డీఎస్సీ టీచర్ రిక్రూట్‌మెంట్ గురించి ఆయన ప్రస్తావించారు, రాత పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండానే సుమారు 421 మంది ఉపాధ్యాయులను నియమించారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి.వి.ఎన్. సత్యనారాయణ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎన్టీఆర్ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె. కోటేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఎం. వెంకటేశ్వరరావు, హెచ్‌సిఎల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ వి. సత్యనారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనేరు రాజేష్ సహా పలువురు ఫిజికల్ డైరెక్టర్లు కూడా పాల్గొన్నారు.

కాలిఫోర్నియా బాదంపప్పులతో రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): ప్రతి సంవత్సరం నవంబర్ 14న జరుపుకునే ప్రపంచ మధుమేహ దినోత్సవం , మధుమేహం గురించి అవగాహన మెరుగుపరచటం, అందరికీ అందుబాటులో ఉండే సంరక్షణ ప్రాముఖ్యతను వివరించటం లక్ష్యంగా పెట్టుకుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రోటీన్, అసంతృప్త కొవ్వులు, డైటరీ ఫైబర్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న బాదంతో మీ రోజును ప్రారంభించడం ఆరోగ్యకరమైన రీతిలో రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. న్యూఢిల్లీలోని ఫోర్టిస్-సి-డిఓసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ఫర్ డయాబెటిస్, మెటబాలిక్ డిసీజెస్ మరియు ఎండోక్రినాలజీలో ప్రొఫెసర్, ఛైర్మన్ డాక్టర్ అనూప్ మిశ్రా నేతృత్వంలోని ఇటీవలి అధ్యయనంలో, ప్రీడయాబెటిస్, ఊబకాయంతో బాధపడుతున్న ఆసియా భారతీయులలో భోజనానికి ముందు బాదం వినియోగం రక్తంలో చక్కెర నియంత్రణను గణనీయంగా మెరుగుపరిచిందని కనుగొంది. మీ రోజును కొన్ని బాదంలతో ప్రారంభించడం, శక్తి స్థాయిలను మెరుగుపరచడంలో, సంతృప్తిని ప్రోత్సహించడంలో, ప్రాసెస్ చేసిన ఆహారాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి పేర్కొన్నారు.

సుగమ్ రిన్ భుగ్తాన్ యోజన పేరిట ఐడిబిఐ బ్యాంక్ ప్రత్యేక ఓటీఎస్ పథకం

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): ఐడీబీఐ బ్యాంక్ తన రికవరీ ప్రయత్నాలను పెంచడానికి "సుగమ్ రిన్ భుగ్తాన్ యోజన అనే ప్రత్యేక వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం 2022 మార్చి 31 వరకు వర్గీకరించబడిన రిటైల్ ఎన్పీఏలను కవర్ చేస్తుంది. రుణగ్రహీతల వారీగా మొత్తం గ్రాస్ ప్రిన్సిపల్ అవుట్‌స్టాండింగ్ రూ.5 లక్షలు, అంతకన్నా ఎక్కువ, రూ.5 కోట్ల వరకు, పథకంలో పేర్కొన్న ఇతర అర్హత ప్రమాణాలకు లోబడి ఉంటుంది. ఈ చౌరవ ఎన్పీఏలుగా వర్గీకరించబడిన, పథకం నిబంధనల ప్రకారం వారి బకాయిలను సెటిల్ చేయడానికి సిద్ధంగా ఉన్న రుణగ్రహీతలకు చట్టపరమైన చర్యలను నివారించడానికి అవకాశాన్ని అందిస్తుంది.

మహిమ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు స్వటర్ లు పంపిణీ

విశాలాంధ్ర -కంచికచర్ల : మహిమ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు స్వెట్టర్, మఫ్లర్ లు పంపిణీ చేశారు. వీరులపాడు మండలం, కంచికచర్ల మండలాల్లో ఉన్న నిరాధారణకు గురైన వృద్ధులకు మహిమ ఫౌండేషన్ ద్వారా స్వెట్టర్ లు, మఫ్లర్ లు పంపిణీ చేశారు ఫౌండేషన్ నిర్వాహకులు సురేష్ మాట్లాడుతూ ఈ చలికాలంలో ప్రధానంగా వృద్ధులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు ఇటువంటి పరిస్థితుల్లో వృద్ధులకు సహాయం చేయటం చాలా ఆనందం గా ఉంది ఈ మంచి పనికి సహకరిస్తున్న మా ఫౌండేషన్ టీమ్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో కొంత మంది ఫౌండేషన్ సభ్యులు మోదుగు ఆనంద్ క్రీస్తు సంఘము సువార్తీకులు, మాజీ సైనికుడు శివాజీ, చింతల చంద్రకళ, హనీ ఆటో మొబైల్స్ ఓనర్ మోషే, కోట శ్రీనివాసరావు, సుశీల ఆనంద్ పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్స్‌గా స్టేడియం క్రీడాకారులు

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల జరిగిన 37వ ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్‌షిప్ పోటిలలో ఎన్‌టిఆర్ స్టేడియం స్కేటింగ్ క్రీడాకారులు వివిధ విభాగాలలో విజయం

సాధించడం అభినందనీయమాని స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్తా కార్యదర్శి కిలారపు రంగప్రసాద్‌లో అన్నారు. శనివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో స్కేటింగ్ పోటిలలో విజయం సాధించిన క్రీడాకారలను అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.6.23 లక్షల విరాళం అందజేత

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణ గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మానంలో భాగంగా మూడు రోజుల నుంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. చివరి రోజు శనివారం తెల్లవారుజామున 3 గంటల నుండి అమ్మవారికి కొత్తగా నిర్మించిన తాత్కాలిక భవనం బాలాలయంలోకి అమ్మవారిని ప్రతిష్టించడం జరిగింది. ఈ కార్యక్రమం బద్వేలు నివాసి వందకు పైగా దేవాలయాల ప్రతిష్టలు జరిపిన శివ కుమార్ శర్మ ఆధ్వర్యంలో మరియు పట్టణ పురోహితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో వాళ్ల బృందం అంతా కలిపి కార్యక్రమం పూర్తి చేశారు. అలానే శుక్రవారం నుంచి జరుగుతున్న చండీ హోమానికి శనివారం ఉదయం 9 గంటలకు పూర్ణ హుతి కార్యక్రమం జరిగింది. శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయం నకు భక్తులు విరివిగా ధన, వస్తు, సమయ సమర్పణ చేయాలని నిర్వాహకులు కోరినందున కొద్ది మంది భక్తులు తమ సమర్పణను నిర్వాహకురాలు నల్లూరి పద్మకు అందజేశారు. వినుకొండ పట్టణ గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మానంలో భాగంగా దేవాలయ పూజారి గోళ్ళ వెంకటేశ్వర్లు ధర్మపత్ని సీతామహాలక్ష్మి లు 2,00,000 గుడిపాటి రంగారావు ధర్మపత్ని నాగ కమల 1, 11,11 6 నల్లం శ్రీనివాసరావు ధర్మపత్ని ప్రశాంతి 1,11,116 నల్లూరి వీర రాఘవులు ధర్మపత్ని పద్మ 1,01,116 సనిశెట్టి గురవయ్య ధర్మపత్ని పద్మావతి 1,00,000 విరాళంగా అందజేశారు.

అన్నదానమే మోక్షానికి మార్గం

విశాలాంధ్ర-పెదకూరపాడు: కలియుగములో అన్నదానమే మోక్షానికి మార్గమని పెదకూరపాడు మండల సర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షులు, బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన అర్తిమళ్ల శేషయ్య,జానకి దంపతుల కుమార్తె హేమశ్రీ,నేతాజిల వివాహం సందర్భంగా పెదకూరపాడ మండల పరిధిలోని 75 త్యాళ్ళూరు శాంతి కాలనీలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ పేదవారికి భోజనాలు ఏర్పాటు చేసిన శేషయ్య దంపతులు అభినందనీయులన్నారు.ఈ కార్యక్రమంలో అర్తిమళ్ళ వెంకటరావు,గల్లా వసంతరావు, జనచైతన్య సమితి ప్రతినిధులు బెజ్జం నాగేశ్వరరావు,కొర్రపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా 250 మందికి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

ఆవులు, ఎద్దులను బందెల దొడ్డికి తరలిస్తాం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కి తీవ్ర ఆటంకంగా ఉంటున్న ఆవులు, ఎద్దులు, దూడలను ఈ నెల 10వ తేదీ నుంచి వెంగళాయపాలెంలోని జీఎంసీ బందెలదొడ్డికి తరలిస్తున్నామని, ఆయా పశువులను వాటి యజమానులు రోడ్ల మీదకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ప్రధాన రహదారులపై పశువులు విచ్చలవిడిగా ఉండడం వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని, కొన్ని సమయాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పలుమార్లు పశువులను రోడ్ల మీదకు వదిలితే తగు చర్యలు తీసుకుంటామని తెలియచేసినా యజమానులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని అన్నారు. బందెలదొడ్డికి తరలించిన పశువులను విడుదల చేయబోమని, అలాగే భారీ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎవరైనా రోడ్ల మీద పశువుల వలన సమస్య ఎదుర్కొంటే జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

స్కిల్ కాంపిటీషన్‌లో రెండవ స్థానం పొందిన విద్యార్థులు

విశాలాంధ్ర-దుర్గి: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్స్ శుక్రవారం (లితమ్) ఇంజనీరింగ్ కాలేజ్, సత్తెనపల్లి మండలం లో నిర్వహించడం జరిగింది. ఇందులో 66 వివిధ ప్రభుత్వ పాఠశాల నుండి 900 మంది విద్యార్థులు 10 ట్రేడ్స్ లో పాల్గొనడం జరిగింది. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుర్గి లో 9వ తరగతి విద్యార్థులు. కే అలేఖ్య.,ఏం యశస్విని., కే మౌనిక., ఈ శివ కోటేశ్వరరావు., ఆర్ చరణ్,. టీ లోకేష్,ఎం దేవ ప్రాన్సిస్ తయారుచేసిన ప్రాజెక్టు స్కిల్ కాంపిటీషన్లో రిటైల్ ట్రేడ్ నందు రెండో బహుమతి సాధించారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ విద్యార్థులకు షీల్డ్, సర్టిఫికేషన్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ హనుమంతరావు, ఉపాధ్యాయులు రమేష్ జి సి హెచ్ అనంతరామయ్య, కరీం, కృష్ణయ్య, కోటేశ్వరరావు, పద్మ, భారతి, సంపూర్ణ, హబీబున్నీసా తదితరులు అభినందించారు,

రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

విశాలాంధ్ర-వినుకొండ: కొండపై వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారాలయ పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు శనివారం అంకురార్పణ చేశారు. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్త పూజలు నిర్వహించగా, అనంతరం పునర్నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ. వినుకొండ కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని సమగ్ర పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రాధాన్యం. భక్తులకు సౌకర్యాలు మెరుగుపడేలా రహదారి, త్రాగునీరు, వసతి వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తాం అన్నారు. 32 మంది సభ్యులతో కొత్త కమిటీ, దేవాలయ నిర్వహణలో పారదర్శకత, పనుల నాణ్యత, భక్తసేవకు ప్రాధాన్యత ఇవ్వాలనే లక్ష్యంతో, దేవాలయ కమిటీ మరియు అభివృద్ధి కమిటీ కలిపి మొత్తం 32 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేయబడిందని సభ్యులు వెల్లడించారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యతలో లోపాల కారణంగా, కమిటీ ఏకాభిప్రాయంతో కొత్త కాంట్రాక్టర్ నియామకం చేశారు. నిర్మాణ పనులు పునః ప్రారంభం కావడంతో దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలు మరల గతి పొందాయి. దేవాలయ అభివృద్ధికి విరాళాలు అందిస్తున్న దాతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రతి దానం భక్తి భావంతో వినియోగించబడుతుంది. నాణ్యమైన నిర్మాణం మా ప్రధాన ధోరణి. ఈ సందర్భంలో రేపు ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని రూ.11 లక్షల రూపాయలను దేవాలయ అభివృద్ధి కోసం కమిటీకి అందజేస్తున్నట్లు జీవీ గారు ప్రకటించారు. ఇప్పటికే మరికొందరు భక్తులు కూడా విరాళాలు అందించడానికి ముందుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధి పనులు, ప్రతిపాదిత సౌకర్యాలు భక్తుల కోసం ప్రసాదం మరియు సేవా కౌంటర్లు, పూజారి మరియు సేవకులు నివసించే గృహాలు, కళ్యాణ మండపం, అభిషేక మండపం, ఆలయం పరిసరాల్లో పచ్చదనం మరియు చెట్ల పెంపకం, ఆలయ ప్రాకార నిర్మాణానికి సుమారు రూ.4 కోట్లు అవసరమవుతుందని, ఇందుకు సంబంధించి ఇన్‌చార్జ్ మంత్రి మరియు కలెక్టర్ తో చర్చించగా నిధులు ఇప్పటికే శాంక్షన్ అయ్యాయని సభ్యులు తెలిపారు. అదనంగా, మిగిలిన అవసరమైన ఫండ్లను దేవాదాయ శాఖ మంత్రి మరియు ముఖ్యమంత్రి తో చర్చించి నిధులు తీసుకొస్తామన్నారూ. పల్నాడు జిల్లా భక్తులందరూ గుడి పునర్నిర్మాణంలో భాగస్వాములై, సేవ మరియు సహకారం అందించాలి. ఇది కేవలం నిర్మాణం కాదు %-% మన సంస్కృతి, భక్తి, ఆధ్యాత్మిక వారసత్వానికి పునరుద్ధరణ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, దేవాలయ కమిటీ అధ్యక్షులు అచ్యుత రామ కోటేశ్వరరావు , మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా , పీవీ సురేష్, ప్రముఖ వ్యాపారవేత పోట్ల రాధాకృష్ణమూర్తి, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో జరగనున్న నూతన ఆసుపత్రి భవనాల ప్రారంభోత్సవము కార్యక్రమము, ప్రముఖులతో జరగనున్న సమావేశ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శనివారం పరిశీలించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వీవీఐపీ, వీఐపీలు, ఇతర ప్రముఖుల ప్రవేశ ద్వారాలు, వాహనాల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పక్కా ప్రణాళికలతో అధికారులు అందరూ సమన్వయం కలిగి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వాహనాలకు నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసి, వాహనాల పార్కింగ్‌కి సంబంధించి సూచిక బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని, తగినంత మంది సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. వీవీఐపీ భద్రతను దృష్టిలో పెట్టుకుని జిల్లా భద్రత విభాగం వారి ద్వారా సాంకేతిక పరికరాలతో తనిఖీ నిర్వహించే విధంగా ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట బారికేడింగ్, స్టాపర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు, పెదకాకాని సీఐ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

340వ రోజుకు సిమెంట్ కార్మికుల దీక్షలు

విశాలాంధ్ర-తాడేపల్లి : న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 340 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకులు కె.స్టీవెన్, ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, డి.నాగేశ్వరరావు, గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో దామవరపు సువర్ణ, మొలక శారద, దేరంగుల రమణమ్మ, వి.లక్ష్మి, దర్శి బేబీమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, వైపేద సుబ్బారావు, సూర్యప్రకాష్, సుభాని, మాణిక్యారావు, సాంబశివరావు, రమాదేవి, ఇమాంభి, శరమ్మా, రిబ్కా, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

భక్తి-సాంస్కృతిక శోభలో 16న యాదవుల వన సమారాధన

విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన మహోత్సవం ఈ నెల 16వ తేదీ ఆదివారం మంగళగిరి బైపాస్ రోడ్డులో గల హ్యాపీ రిసార్ట్స్‌లో వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం మంగళగిరి బైపాస్‌లోని వైటీఆర్ ట్రస్ట్ ఆవరణలో యాదవ సంఘ నాయకులు ఆవిష్కరించారు. యాదవ సంఘ నాయకులు మాట్లాడుతూ కార్యక్రమం ఉదయం 8 గంటలకు గోపూజతో ప్రారంభమై, అనంతరం వందమంది దంపతులతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్య ప్రదర్శనలు, పిల్లలు, పెద్దల కోసం ఆటల-పాటల పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు భోజన విందు అనంతరం ప్రముఖ యాంకర్ ఆధ్వర్యంలో పాటల-డాన్స్ పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి యాదవ కుల పెద్దలు, ప్రముఖులు హాజరై ఆశీర్వచనాలు అందజేయనున్నారని, సాయంత్రం సహకరించిన దాతలతో పాటు పెద్దలకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తుల్లిమిల్లి రామకృష్ణ, తోట పార్థసారథి, ఎర్రకుల తులసీరామ్, తోట శివరాం, కుర్ర శ్రీనివాసరావు, దానబోయిన శివశంకరరావు, పేరుబోయిన వెంకటేశ్వరరావు, రుద్రు శ్రీనివాసరావు, తోట సాంబశివరావు, చింకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా నేత జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అమరావతి: గ్రామంలోని ప్రజా దర్బార్‌కు హాజరైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో పల్నాడు జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శి మైనారిటీ మహిళా నేత ముంతాజ్ పుట్టినరోజు వేడుకలు శనివారం అమరావతి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ కుటమి ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసంక్షేమం,కొసం పరితపించే ప్రభుత్వానికి ప్రజలు బాసటగా నిలవాలన్ని కోరారు. అనంతరం కేక్ కటింగ్ చెశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెదకూరపాడులో.. టిడిపి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు షేక్ ముంతాజ్ పుట్టినరోజు వేడుకలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బర్త్ డే కేకును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముంతాజ్ కు తినిపించారు. లేడీ డైనమిక్ లీడర్ ముంతాజ్ అని అన్నారు. పార్టీ కార్యక్రమాలు ఎక్కడ జరిగినా రాత్రి అయినా పగలైనా తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసే నాయకురాలు ముంతాజ్ అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకొని పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తుందని పలువురు నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల టిడిపి పార్టీ అధ్యక్షులు మహిళా నాయకురాలు పాల్గొన్నారు.